ప్రజాశక్తి సోపతి
జనవరి 18, 2015 ఆదివారం అనుబంధం

నేతాజీ పై వివాదం !

ఆదివాసీ మహోత్సవం

నాగోబా జాతర

- ప్రమోద్ కుమార్ కథ : మనిషితనం
- భూతం ముత్యాలు 'నియతి'పై సమీక్ష
- అటూ ఇటు : రుక్మిణి వ్యంగ్య రచన
- ఆశారాజు, కోటం చంద్రశేఖర్ కవితలు

ఆమె జీవితం ఉదాత్త గ్రంథం

ఆమె ఒక ఉత్సాహ తరంగం
కదలి అలల సోయగం
సృజనకు నిర్వచనం
నిరంతరం వెలిగే స్వప్నం
ఏకాంతానికి ఆభరణం
ఆత్మాభిమానానికి నిలువెత్తు రూపం
భారతీయ సినిమా కీర్తి కిరీటం

ఈ మాటలన్నీ, ఈ వర్ణనలన్నీ నిజమే. అయినప్పటికీ వీటికి అతీతంగా సదా గుర్తుంచుకోదగ్గ వ్యక్తిత్వంతో అలరారే మనీషి సుచిత్రాసేన్.

సాహిత్య కళా రంగాల్లో ఉన్నతశ్రేణిలో నిలిచిన బెంగాల్ ఆమె తల్లిభూమి. ఆ నేలలో వికసించి విస్తరించి వర్ధిల్లిన ఉదాత్త నటి సుచిత్రాసేన్ (6 ఏప్రిల్ 1931–17 జనవరి 2014). బెంగాలీ భాష రాకున్నా సరే, ఆమె బెంగాలీ చిత్రాల్ని చూస్తే తన్మయ పరవశులమవుతాం. ఆమె సౌకుమార్యం, నటనలోని సహజత్వం, హావభావాల్లోని ముగ్ధత్వం చెప్పనలవి కాని అనుభూతులకు లోను చేస్తాయి. ఆమె ఈలోకం నుంచి నిష్క్రమించి ఏడాదవుతుంది.

సుచిత్రాసేన్ అంటే కేవలం నటి మాత్రమే కాదు, నిండైన వ్యక్తిత్వం, ఆత్మాభిమానం, ఉదాత్త సౌశీల్యం వున్న కళాకారిణి. డబ్బుల కోసం నటించలేదు. పాత్రల్ని వెదుక్కుంటూ వెళ్ళలేదు. పాత్రలే ఆమెను వెదుక్కుంటూ వచ్చాయి. 1952 నుంచి 1978 వరకు సాగిన ఆమె 26 ఏళ్ళ కెరీర్‌లో కేవలం 60 సినిమాల్లోనే నటించారామె. అయినప్పటికీ ప్రతి చిత్రం ఒక మహా కళాఖండం. అక్కడ బెంగాలీలు ఆమెను చాలా ఇష్టంగా, గౌరవంగా 'మహానాయిక'గా అభివర్ణిస్తారు.

సుచిత్రాసేన్ జీవితమూ, వ్యక్తిత్వమూ విభిన్నమైనవి. పెళ్ళి తర్వాతనే సినిమాల్లో నటించి రాణించారు. 1947లో ఆమె వివాహమైంది. 1952లో సినిమాల్లోకి వచ్చారు. ఆమె భర్త, మామయ్యలు ఆమెను నటించడానికి ప్రోత్సహించారు. తొలిరోజుల్లో బెంగాలీ నటుడు ఉత్తమ్‌కుమార్‌తో కలిసి చాలా సినిమాల్లో నటించారు. ఈ జంట నటించిన చిత్రాలకు మంచి ఆదరణ లభించింది.

అయితే సినిమా రంగంలో ఎక్కడా రాజీపడలేదు. అవసరమైనప్పుడు కథలో మార్పులు చేయాల్సిందిగా డిమాండ్ చేసేవారు. తన పాత్రగానీ, కథగానీ నచ్చకపోతే నటించడానికి నిరాకరించేవారు. 1960లలో ఒక సినిమా స్క్రిప్ట్‌తో కలిసిన గుల్జార్‌తో స్క్రిప్ట్‌లో కొన్ని మార్పులు చేస్తేనే నటిస్తానని చెప్పారామె. ఆ మార్పులు ఆయన చేయలేదు. ఆ తర్వాత అసలు ఆ సినిమానే నిర్మించలేదు. ఆ తర్వాత ఆమె 1974లో గుల్జార్ దర్శకత్వంలో 'అంధీ' సినిమాలో నటించారు. ఈ చిత్రం సుచిత్రాసేన్‌కు, కథానాయకుడు సంజీవ్‌కుమార్‌కు, గుల్జార్‌కు మంచి పేరు తీసుకొచ్చింది. విభిన్నమైన పాత్రల్లో ఒదిగిపోయి పాత్రలకు ప్రాణం పోసిన సుచిత్రాసేన్‌ను ఆ చిత్రంలో చూసి విస్మయానికి లోనవుతాం. మరల మరల చూడాలనిపించే సినిమ అది. ఎంతో భావ గాంభీర్యం వున్న పాటలు ఆ చిత్రానికి హైలైట్.

1970లో భర్త మరణించాక కూడా ఆమె సినిమాల్లో నటించారు. నాడు కథానాయికగా ఆమె నటించిన చిత్రాలు విజయవంతమయ్యాయి. 1978లో 'ప్రణయ్ పాషో' చిత్రం ఫ్లాప్ అయింది. ఆ సందర్భంలో ఆమె రామకృష్ణమఠంలో ఓ ఆధ్యాత్మిక తత్వవేత్తను కలుసుకున్నారు. వారితో సంభాషణ తర్వాత ఆమె

పూర్తిగా సినిమాల్లోంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించారు. నట జీవితాన్ని వద్దనుకోవడమే కాదు, పూర్తిగా బయటివాళ్ళను కలవడానికి నిరాకరిస్తూ కేవలం ఇంటికి పరిమితమయ్యారు. కోల్‌కటాకు వచ్చినప్పుడు దేవానంద్‌లాంటివారు ఆమెను కలుసుకోడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. 2005లో కేంద్ర ప్రభుత్వం దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం ఇవ్వాలని సంకల్పించింది. వ్యక్తిగతంగా అవార్డు తీసుకోడానికి అంగీకరించినా, ఢిల్లీకి వెళ్ళి వందలమంది పాల్గొనే పురస్కార ప్రదాన సభలో అవార్డు తీసుకోడానికి ఆమె నిరాకరించారు. దీనితో ఆమెకు ఆ పురస్కారం ప్రకటించలేదు. పూర్తి ఏకాంతాన్ని కోరుకోవడమే దీనికి మూలం. ఒక ప్రగాఢమైన ఆత్మాన్వేషణ ఫలితంగానే అన్నిటిని త్యజించి తనదయిన పద్ధతిలో గడిపారు. సినిమాల్లో నటించే రోజుల్లో ఒక ఉత్సాహ తరంగంలా పడిలేచే కెరటంలా వుండేది ఆమె జీవితం. ఎప్పుడయితే సినీనటిగా వచ్చిన ఇమేజ్‌కు సంబంధించిన సకల సంబంధాలకు దూరంగా ఉండడం మొదలుపెట్టారో అప్పట్నించి ఆమె నిశ్చల సరస్సు లాంటి జీవితాన్ని గడిపారు. చివరకు గత ఏడాది జనవరి 14న ఈలోకం నుంచి నిష్క్రమించారు. ఆమె కోరిక ప్రకారం ఆమె తుదిశ్వాస విడిచిన అయిదున్నర గంటల్లోనే ఆమె అంత్యక్రియలు పూర్తిచేశారు. ఇప్పుడు సుచిత్రాసేన్ లేరు. కానీ ఆమె నటించిన చిత్రాలు అనేకం యూట్యూబ్‌లో చూడొచ్చు. ఒక మహానటి ఉదాత్త జీవితంలోని సృజనాత్మక కోణాల్ని దర్శించవచ్చు. తనకు తాను ఆమె ఏకాంతంలో వుండిపోయినా, ఆ తర్వాత ఈలోకం నుంచే వెళ్ళిపోయినా ఒక 'మహానాయిక'గా ఆమె జీవితం కళాకారులు అధ్యయనం చేయదగ్గ ఉత్తమ గ్రంథం.

– సంజీవి

■ అంతరంగం

ఫాసిజం పొంచివుంది

రాజ్యాంగం కల్పించిన భావప్రకటనా స్వేచ్ఛకు హిందూత్వశక్తులు తూట్లు పొడిచే కార్యక్రమం ఒక పథకం ప్రకారం జరుగుతోంది. "రచయితగా నేను మరణించాను, ఇక నేనేమీ రాయను" అని తమిళ రచయిత ప్రొఫెసర్ పెరుమాళ్ మురుగన్ ప్రకటించాల్సి రావడం సాహిత్య ప్రపంచానికి అవమానకరం. దీనిని బట్టి పరిస్థితి ఎంత దారుణంగా పరిణమించిందో అర్థమవుతోంది. 2010లో 'మధురోభగన్' శీర్షికన తమిళంలో రాసిన నవలని అనిరుద్ధన్ వాసుదేవన్ ఆంగ్లంలోకి అనువాదం చేశారు. 'వన్ పార్ట్ ఉమెన్' శీర్షికన పెంగ్విన్ పబ్లిషర్స్ 2013 డిసెంబర్‌లో ప్రచురించారు. సరిగ్గా ఏడాది తర్వాత ఆ నవల హిందువుల మనోభావాల్ని దెబ్బతీస్తుందని సంఘ్‌పరివార్ శక్తులు పెట్రేగిపోయాయి. రచయిత ఊరు విడిచి పారిపోయేలా చేశాయి. ఆ నవల ప్రతుల్ని దగ్ధం చేశాయి. నాలుగేళ్ళ కిందట రాసిన నవలపై ఇప్పుడు రాద్ధాంతం చేయడం గమనిస్తే ఇదంతా ఒక పథకం ప్రకారం జరుగుతున్న కుట్రగానే భావించాలి.

తమిళనాడులో పాగా వేయాలనుకుంటున్న సంఘ్‌పరివార్ అనుసరిస్తున్న దుర్మార్గమైన వ్యవహార సరళి అక్కడితోనే ఆగిపోదు. దేశమంతటా విస్తరించే ప్రమాదముంది. మతోన్మాదశక్తుల దౌష్ట్యానికి ఇది తాజా ఉదాహరణ. ఒక రచయిత అస్త్ర సన్యాసం చేయాల్సిన పరిస్థితిని కల్పించడం క్షమించరాని ఘటన. ఇక తన పుస్తకాలేవీ అమ్మవద్దని ఆ రచయిత చెప్పాల్సి రావడం విషాదం. ఎవరికయినా విభేదించే హక్కు వుంది తప్ప నిషేధించాలనే మాటలు అసంగతం.

ఇటీవల 'పికె' సినిమా మీద కూడా ఎవరి ఇష్టానుసారం వారు రెచ్చిపోతూ మాట్లాడారు. గతంలో ఎం.ఎఫ్.హుస్సేన్‌ని ఈ దేశం వదిలి వెళ్ళేట్టు చేశారు. మతం పేరిట రాజకీయాలు నడిపే శక్తులు ఎంత దుర్మార్గంగా వ్యవహరించగలవో ఈ పరిణామాలన్నీ చెబుతున్నాయి. అసహనాన్ని రెచ్చగొట్టి సొమ్ము చేసుకునే ధూర్తత్వం ప్రజాస్వామ్య వ్యవస్థలో చెల్లదు. ఈ మాటని లౌకికశక్తులు సంఘటితమై గట్టిగా చెప్పాలి. ఈ అనివార్యతను రచయితలు, కళాకారులు గుర్తించాలి. ఫాసిజం పొంచివుందని అర్థం చేసుకోవాలి. ఎక్కడికక్కడ, ఎప్పటికప్పుడు ప్రతిఘటించకపోతే, నిరసన తెలియజేయకపోతే తమ నోళ్ళను శాశ్వతంగా మూసివేసే పెనుప్రమాదముందని గుర్తించాలి. "ఎదుటివారి భావాలతో విభేదించినా, వాటిని ప్రకటించే స్వేచ్ఛను గౌరవించడం" ప్రజాస్వామిక స్ఫూర్తి. దీనికి విరుద్ధంగా వ్యవహరించడం మతోన్మాదశక్తుల నైజం. ఈ నైజం క్రమక్రమంగా బయటపడుతూ తన విశ్వరూపాన్ని చూపిస్తోంది.

ఈ వైనాన్ని ప్రజలకు వివరించడానికి సృజనకారులంతా ఐక్యం కావాలి. సృజనాత్మక వ్యక్తీకరణలపై అసహనం ప్రకటించడాన్ని అడ్డుకోవాలి. ఈ అవసరాన్ని పెరుమాళ్ మురుగన్ ఉదంతం తెలియజేస్తోంది. అందరినీ ఒప్పించేలా రచనలు చేయడం రచయిత విధి కాదు. అవసరమైతే నొప్పిస్తాడు. వ్యవస్థీకృత విలువల్ని ప్రశ్నిస్తాడు. ఆ ప్రశ్నల మీద చర్చను జరపడం సమాజం విధి. అంతే తప్ప వ్యక్తీకరణే తగదనడం ఫాసిజం. ఈ ధోరణిపై అప్రమత్తంగా ఉండడం సకల రంగాల్లోని ప్రజాస్వామికవాదుల అనివార్య కర్తవ్యం.

వెంటాడే వాక్యం

మూఢులు బల్ల గుద్ది చెబుతున్నారు. విజ్ఞులు నోరు మూసుకుని కూర్చుంటున్నారు. ఈనాటి దుర్మార్గాలకి ఇదే కారణం.
– బెర్ట్రాండ్ రసెల్

ప్రజాశక్తి

సోపతి

జనవరి 18, 2015

లేఖలు	4
కవర్‌స్టోరీ	
ఆదివాసీ మహోత్సవం నాబోబా జాతర	5
కథ మనిషితనం	8
సంగీతం విలక్షణ స్వర మాధుర్యం	11
ప్రత్యేక వ్యాసం నేతాజీపై కొత్త వివాదం	12
నెమలీక	14
సీరియల్ ప్రేమ - విప్లవం	16
మలిసంధ్య నలుగురికీ ఉపయోగపడేలా	18
జోక్స్ కార్నర్	19
వ్యంగ్య రచన అటు - ఇటు	20
సోర్స్‌కోడ్ కనువిందు చేసిన సీఈఎస్ 2015	22
హోమియో చికిత్సతో జీర్ణాశయ సమస్యలు దూరం	23
సమీక్షలు	
ఆత్మ గౌరవం ప్రభవించిన ఆత్మ కథ	24
ఈ వారం కవిత్వం	
మంచివి కానవిన్నీ మంచివే	26

ఈ నెల 19 నుంచి ఆదివాసీల మహోత్సవం నాగోబా జాతర కెస్లాపూర్‌లో జరగబోతుంది. దీనికి సంబంధించిన స్థలపురాణాన్ని, ప్రత్యేకతల్ని వివరించే ముఖచిత్ర కథనమిది.

లేఖలు



పరిష్కారం చూపుతుంది

'ఆధునిక సాగు కేరాఫ్ అంకాపూర్' వ్యాసాన్ని ప్రతి రైతూ చదవాలి. నేటి కాలపు అన్నదాతల ఆత్మహత్యలకు పరిష్కారం అంకాపూర్ రైతుల వ్యవసాయం చూపేలా వుందీ వ్యాసం. 'అంతరంగం' శీర్షికన ప్రచురించిన 'ప్రశ్నించడం ఓ చైతన్యం' చాలా అద్భుతంగా వుంది. ప్రశ్న గొప్పతనాన్ని బాగా తెలియజేశారు. ప్రశ్నించక పోతే జరిగే అనర్థాన్ని చక్కగా వివరించారు. ఆధునిక కాలంలో విద్యార్థుల్లో ప్రశ్నించే చైతన్యాన్ని యాంత్రిక చదువులు కల్గించక పోవడం అత్యంత దురదృష్టకరం. శోచనీయం. సోపతి లాంటి పత్రికను ప్రతి విద్యార్థి చదివి పదిల పరుచుకోవాలి. 'టేకు పూలు' కవిత, 'చిరాకులు, చిర్రు బుర్రులొద్దు' వ్యాసం బాగున్నాయి. ఆధునిక తల్లిదండ్రుల, విద్యార్థుల పరిస్థితిని తెలియజేస్తూ పరిష్కారాన్ని సూచించింది. నెమలీకలో 'ఇంగిత జ్ఞానం' కథ బాగుంది. 'జాతి వివక్షపై నిరసన స్వరం'లో దక్షిణాఫ్రికాకు చెందిన నాదిన్ మహిళ జీవితం స్ఫూర్తిదాయకంగా వుంది.

– గడేల సర్వజ్ఞారెడ్డి, జప్తిలింగారెడ్డిపల్లి, మెదక్

ఆదర్శ గ్రామం అంకాపూర్

ఉన్న భూమినే అనుకూలంగా మార్చుకొని సాగులో మేటిగా అనిపించుకున్న అంకాపూర్ గురించి 'ఆధునిక సాగు కేరాఫ్ అంకాపూర్' పేరుతో సోపతిలో కవర్ స్టోరీగా ఇవ్వడం చాలా బాగుంది. చాలా గ్రామాల్లో సైతం వ్యవసాయం కనుమరుగవుతున్న ఈ కాలంలో ఒక్క పంట కాక వేరు వేరు పంటలు పండిస్తూ వ్యవసాయంలో కొత్త కొత్త విధానాలు అనుసరిస్తున్నారు. ముఖ్యంగా తెలంగాణలో నీటి సమస్య ఎక్కువగా ఉంటుంది. అటువంటిది నీటి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నారు. ఉన్న నీటితో అనుకూలమైన పంటలు పండించి ఆదాయం పొందుతున్న ఆ గ్రామాన్ని మిగిలిన గ్రామాలు ఆదర్శంగా తీసుకోవాలి. ప్రధానంగా కొత్తిమీర సాగు చేసి అతి తక్కువ సమయంలో ఎక్కువ ఆదాయాన్ని సంపాదిస్తున్న అక్కడి రైతుల సమయస్ఫూర్తిని కచ్చితంగా మెచ్చుకొని తీరాలి. అలాగే వ్యవసయానికి సేంద్రీయ ఎరువులు, పేడ వాడకం, కూరగాయలు ఎక్కువగా ఆ ఎరువులతోనే పండించడంలో ఆదర్శవతంగా ఉన్నారు.

– జ్యోతి, నల్గొండ

భారతీయులందరికీ గర్వకారణం

సంగీతానికి సంబంధించి సోపతిలో వారం వారం ఇస్తున్న సమాచారం చాలా బాగుంటుంది. ప్రతి వారం ఏదో ఒక అంశాన్ని, వ్యక్తిని తీసుకొని ప్రచురిస్తున్నారు. పాత మధురాలను గుర్తుచేసుకోవడం, ఆ వ్యక్తుల జీవిత విశేషాలు తెలుసుకోవడం చాలా సంతోషంగా ఉంది.ఈ వారం 'తెలుగులో తక్కువే కానీ' పేరుతో వచ్చిన ఎఆర్ రెహ్మాన్ గురించి ఇచ్చిన స్టోరి బాగుంది. గోల్డెన్ గ్లోబ్ అవార్డు అందుకున్న తొలి భారతీయుడిగా ఎఆర్ రెహ్మాన్ భారతీయులందరికీ గర్వకారణం.

– మహేష్, హైదరాబాద్

ఏదైనా వ్యాపారమే

'భూమీ లొటారం – గాలీ పటాలం' వ్యంగ్య రచన ఆసక్తిగా సాగింది. నేడు పెద్ద మనుషులుగా చెలామణి అవుతున్న కొంతమంది చిన్న రైతుల దగ్గర తక్కువ ధరకు భూమిని తీసుకుని ప్లాట్ల వ్యాపారం చేసి కోట్లకు కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నారు. ఆ రైతులు భూమిని ఇవ్వకపోతే నయానో, భయనో, సెంటిమెంటునో కొట్టి స్వాధీనపరుచుకుంటున్నారు. ఒక్క భూమినే కాదు, గాలినీ, నీళ్ళనీ, మట్టి, బొగ్గు... ఏదీ వ్యాపారానికి అనర్హం కాదు అని నిరూపిస్తున్నారు అతి తెలివి వ్యాపారులు.

– ఆదిత్య, మహబూబాబాద్

మన జాతీయాలు

గూపలు గూస్తున్నవి

గూపలు అంటే గూబలు, గుడ్లగూబలు. గూస్తున్నవి అంటే కూస్తున్నవి. రాత్రివేళల్లో సద్దు మణిగిన తర్వాత పెద్ద పిట్టలు గుగ్గూ గుగ్గూ అని కూస్తుంటాయి. గుడ్లగూబలు ఒక ప్రత్యేకమయిన పద్ధతిలో గులుక్ గులుక్ మని కూస్తుంటాయి. గుడ్లగూబలు ముఖ్యంగా పాడుపడిన కొంపల్లో, మరుగు ప్రదేశాల్లో, చీకటిగుహల్లో, పాడుబడిన దేవాలయాల్లో, నిర్మానుష్య ప్రదేశాల్లో నివాసమేర్పరుచుకుంటాయి. కళకళలాడుతున్న, దీపమున్నచోట, వెలుతురులో జనసంచారం వున్నచోట ఇవి వుండజాలవు. గూబలు గూస్తుండటం అంటే పాడుబడటం, కళకళలాడుతున్న ప్రదేశం కళావిహీనం కావడం, మనుషుల ఉనికి తగ్గిపోతే గూబలు నివసిస్తాయి. సర్వకళాశోభితమైన సంసారం ఏదో కారణాలతో నిర్వంశమై మూలపడితే ఈ జాతీయాన్ని ఉపయోగిస్తారు. "రోజుకు నూరుమంది వచ్చిపోయే వాళ్ళతో ఈ గడి ఒక్క వెలుగు వెలిగింది. అటువంటిది ఇప్పుడు గూపలు గూస్తున్నాయి. ఎంతమంది కళకళ గొట్టిందో అనటంలో ఈ జాతీయం ప్రయోగం చూడొచ్చు.

డూడూ బసవన్న

గంగిరెద్దులు బాగా శిక్షణ పొంది ఉంటాయి. గంగిరెడ్లవారు ఎట్లా చెబితె అట్ల తల ఊపడం బసవన్న పని. యుక్తాయుక్త విచక్షణతో పనిలేకుండా అన్నదానికల్లా తలవూపేవారు. దొరల దగ్గర కొందరుంటారు. ఏరా ఎల్లయ్యా! మొన్న నేను వెయ్యి రూపాయలు దానమియ్యగా నీవు చూడలేదా అంటే "అయ్యా మీరు నా ముందరే యిస్తిరి" అంటాడు ఎల్లయ్య. ఇలాంటి ఎల్లయ్య మల్లయ్యలే డూడూ బసవన్నలు. దొర ఏం జెపితే అదే అంటారు అనటంలో ఈ జాతీయం వాడకంలో వుంది.

కింద వేయుట

మరణం ధ్రువమై మంచంలో నుండి అందరు పట్టుకొని చనిపోయే వారిని భూమి మీదకు చేరుస్తారు. దీన్నే కిందవేయుట అంటారు. పంచభూతాల్లో నుండి ప్రాణి వచ్చింది. మళ్ళీ పంచభూతాల్లో కలిసిపోవాలి. పంచభూతాల్లో ఒకటైన నేలపైన్నే మరణించటం వల్ల ప్రకృతిలో ప్రాణి లీనమవుతుందన్న విశ్వాసం దీనికి కారణం. "ఇంక ఆశలేదు. కిందేసిండ్రు. ఇప్పుడో అప్పుడో అన్నట్లుంది" అనటంలో ఈ జాతీయం ఉపయోగిస్తారు.

– వేముల పెరుమాళ్ళు

■ కవర్ స్టోరీ

ఆదివాసీ మహోత్సవం
నాగోబా జాతర

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొట్టమొదటిసారిగా ఈ నెల 19వ తేదీన నాగోబా జాతర ఆరంభమవుతుంది. ఈ జాతర ఆదివాసీల మహోత్సవం. నాగోబా వారి నమ్మకాల, విశ్వాసాల ఆలయం. ఆదివాసీలలో మేస్రం వంశీయుల ఆరాధ్యదైవం నాగోబా. ఆదిలాబాద్‌కు నలభై కిలోమీటర్ల దూరంలో ఇంద్రవెల్లి మండలం ముత్నూర్ దగ్గర కెస్లాపూర్ గ్రామంలో వుంది నాగోబా దేవాలయం. కెస్లాపూర్ చిన్న గ్రామం. కానీ ఆ జాతర సందర్భంగా తరలివచ్చిన లక్షలాది మంది భక్తులతో జనారణ్యమవుతుంది. ఇక్కడికి మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒరిస్సా, చత్తీస్‌గడ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి భక్తులు తండోపతండాలుగా తరలి వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. నాగోబా జాతరకు సంబంధించిన స్థలపురాణం ఆసక్తికరమైంది. కనుకనే ఈ జాతరకు ఉన్న విశిష్టత గురించి మేస్రం మనోహర్ ప్రత్యేకంగా ఒక పుస్తకమే రాశారు. ఇప్పుడు నాగోబా జాతరపై ప్రత్యేక కథనాన్ని 'సోపతి' పాఠకుల కోసం అందిస్తున్నారు.

కేస్లాపూర్ గ్రామం, ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం ముత్నూరు నుండి 4 కిలోమీటర్ల దూరంలో వుంది. ఇది గోండి ధర్మ సాంస్కృతిక కేంద్రంగా ఆదివాసి గోండు, ప్రధాన ఆదివాసి జాతుల పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధిగాంచింది.

గోండి ధర్మం ఎప్పటి నుండి ఆరంభమైందో, అప్పటి నుండి మెస్రం తెగకు చెందిన గోండులు, ప్రధానులు ఇక్కడ పూజ చేయడం జరుగుతుంది. వారి మౌఖిక కథల అనుసారంగా చరిత్రలోకి వెళ్తే... మెస్రం తెగలోని వెడ్చాల్‌దేవ్, రూప్‌దేవి సంతానం ఏడుగురు అన్నదమ్ములు. బాలే సూర్యాల్, తరువాత వరుసగా బాలె అయిత్యాల్, బాలే జైతాల్, బాలే శేఖల్, అన్ మోలాల్, ధన్ మోలాల్, సోన్ మోలాల్. వీరు భోవుల్‌మచ్వా అనగా ప్రస్తుత కేస్లాపూర్‌ని రాజధానిగా చేసుకుని జీవనం కొసాగించారు. వీరందరిని పడియోర్లు అంటారు.

వీరిలో చిన్న పడియోర్ ఒక రోజు తన మూల పురుషుడైన శ్రీ శేఖల్ అనగా ఆదిశేషుని దర్శించుటకు పాతాళ లోకం ప్రయాణం చేయడానికి నిశ్చయించుకున్నాడు. అంతకంటే ముందు అందరు అన్నదమ్ములను పిలిచి 'నేను తిరిగి వచ్చే వరకు డోలు, సన్నాయి, కీక్రి (ఆదివాసుల ముఖ్యమైన సంగీత సాధనం. ఇది లేకుండా పూజ, ఇత్యాది కార్యక్రమాలు జరగవు)ని ఐదు రోజులు ఆపకుండా వాయించాలి' అని చెప్పి సముద్రంలో ప్రయాణమైనాడు.

ఇటు రేవు వద్ద అన్నదమ్ములు – తమ్ముడు సముద్రంలోకి వెళ్తున్నాడు, తిరిగి వస్తాడో రాడో అని దిగులుపడసాగారు. సముద్రంలో ప్రయాణం చేస్తూ నాగలోకానికి చేరాడు. అక్కడ శ్రీ శేఖల్ ఆది శేషుని వద్ద ద్వార పాలకుడుగా బోదిమీన్ బుద్యాల్ వున్నాడు. ఈయన రాకను చూసి 'ఎవరు మీరు? ఇటు ఎందుకు వస్తున్నారు? అక్కడే ఆగు' అని అన్నాడు.

'నేను భోవుర్ మచ్వా వాస్తవ్యుడను. నా పేరు పడియోర్. నేను శ్రీ

శేఖల్‌ను దర్శించుటకు వచ్చినాను. నాకు త్రోవ ఇవ్వు' అన్నాడు.

అప్పుడు ద్వార పాలకుడు – 'శ్రీ శేఖల్ ప్రస్తుతం అంత:పురంలో లేడు. ఆయన తన భాండాగారం, ముత్యాలు, వజ్రాలు, మణులు, మాణిక్యాలు ఉన్న చోటుకు ఆహారానికి వెళ్లినాడు. మీరు దయచేసి ఇక్కడనుండి వెళ్ళండి' అన్నాడు.

ఆయన మాటలను వినకుండా పక్కను నెడుతూ ఒక్క ఉదుటన ఎగిరి శ్రీ శేఖల్ టుంగుటుయ్యాల మీద కూర్చున్నాడు. అక్కడే కొద్దిసేపు ఉయ్యాల ఊగి అక్కడ వున్న ఎనిమిది తాంబూలాలలో ఒక దానిని తిని అక్కడే ఉమ్మివేసి తిరిగి ప్రయాణమవుతూ భోవుర్ మచ్చా రాజు పడియోర్ వచ్చినాడని శ్రీ శేఖల్‌కు చెప్పవలసినదిగా చెప్పి బయలుదేరినాడు.

ఇంతలో తన బంగారు సింహాసనం వైపు శ్రీ శేఖల్ చేరుకున్నాడు. రాగానే అతనికి మానవ వాసన రావడం జరిగింది. ద్వారపాలకుని పిలిచి 'ఏమిటి ఇక్కడ ఇలా వుంది? సింహాసనం పై ఎవరు కూర్చున్నారు? ఇక్కడ తమలపాకు తిని దీనిని అపవిత్రం చేసిందెవరు? మొత్తం మానవ వాసన వస్తుంది' అని కళ్ళెర్ర జేసి అడిగినాడు. ద్వారపాలకుడు 'ఎవరో ప్రభూ, భోవుర్‌మచ్చా నివాసి మీరు లేనప్పుడు ఇక్కడికి వచ్చి వద్దన్నా బలవంతంగా మీ సింహాసనంపై ఆశీనుడైనాడు' అని బదులు చెప్పినాడు.

అప్పుడు శ్రీ శేఖల్ ఆదిశేషుడు 'ఆయనకు ఏమి తక్కువ చేశాను. రాజ్యము, సంపద, ధనధాన్యాలు అన్నీ ఇచ్చినాను. నా సింహాసనమును అపవిత్రం చేస్తాడా? ఆయన వంశం లేకుండా నాశనం చేస్తాను' అని భోవుర్‌మచ్చా ప్రయాణమైనాడు.

ఇటు పడియోర్ నా వంశపురుషుని వద్దకు వెళ్ళి వచ్చినాను అని భోవుర్‌మచ్చాలో అందరికీ దానధర్మాలు చేయడం ప్రారంభించాడు. ఈ విషయం తెలుసుకున్న కాలజ్ఞానవేత్త అయిన సుమంత్ ప్రధాన్ భోవుర్‌మచ్చా ప్రయాణమైనాడు. భోవుర్‌మచ్చా శివారులో ప్రవేశించగానే కొద్దిగా విశ్రాంతి తీసుకుందామని కూర్చున్నాడు.

అంతలో శ్రీ శేఖల్ భోవుర్‌మచ్చా శివారులో భారీ ఆకారంలో నోరు తెరిచి కింద దౌడ భూమికి, పై దౌడ ఆకాశానికి చేసి వున్నాడు. చుటుపక్కల మొత్తం చీకటి ఆవరించింది. ఈ సంఘటన చూసి సుమంత్ ప్రధాన్ 'ఏమిటిది? ఇంత భయంకరమైన ఆకారం' అని దగ్గరకు వెళ్ళినాడు. 'మీరు ఎవరు? ఎందుకు ఇంత కోపోద్రిక్తులైనారు?' అని అడిగినాడు.

అప్పుడు శ్రీ శేఖల్ 'నేను నాగలోకము, పాతాళ ద్వీపంలోని ఆదిశేషుడను. శ్రీ శేఖల్‌ను. భోవుర్‌మచ్చా పడియోర్ వచ్చి నా సింహాసనము అపవిత్రం చేసినాడు. ఆయన వంశమును, ఆయనను నాశనం చేద్దామని వచ్చాను' అన్నాడు.

అప్పుడు సుమంత్ ప్రధాన్ 'ఈ నగరంలో స్త్రీలు, పిల్లలు, ముసలివారున్నారు. వారందనినీ నాశనం చేస్తానంటే ఎలా? ఎవరు తప్పు

చేశారో వారిని తీసుకుని వస్తాను. నీవు మాత్రం నా మాట వినుము' అని వినయపూర్వకంగా చెప్పినాడు. అలాగే అని శ్రీ శేఖల్ అన్నాడు. అప్పుడు సుమంత ప్రధాన్ తన చేతిలో ఏడు కుశారుపుల వెదురు కర్ర తీసుకుని ఆయన చుట్టూరా గీత గీసి 'నేను తిరిగి వచ్చే వరకు ఈ గీత దాటకూడదు. ఒకవేళ అలా దాటితే నీకు ఆన' అన్నాడు.

సుమంత్ ప్రధాన్ భోవుర్‌మచ్చా వెళ్ళి జరిగిన సంగతి పడియోర్‌కు వివరించి చెప్పాడు. అప్పుడు తమ వంశాన్ని, తమని ఎలాగైనా నీవే కాపాడాలి అని పడియోర్ అన్నాడు. అప్పుడు ఏడు కావడులతో పాలు, పెరుగు, పండ్లు, తేనె, నైవేద్యం తయారు చేసి తీసుకుని శ్రీ శేఖల్ ఆదిశేషుని నోట్లో వేశారు. నైవేద్యం స్వీకరించి శాంతించి, ఇక మీదట ఇలాంటి పని చేయకూడదు మీరు. గోదావరి నదిలోని హస్తిన మడుగు నీటిని ప్రతి పుష్య మాసంలో తీసుకుని వచ్చి అమావాస్య నాడు తన పూజ చేయవలెనని చెప్పి మాయమయ్యాడు. ఆ ప్రాంతం కేస్లాపూర్‌లోని ప్రస్తుత ఆలయమున్న చోటు. అప్పటి నుండి అక్కడ జాతర కొనసాగుతున్నది. అదే నాగోబా జాతర.

పుష్యమాసంలో నెలవంక కనిపించిన రోజున మెస్రం వంశస్థులు, గోండు ప్రధానులు అక్కడ గుమిగూడి మెక్రి రెండవ రోజు ఎడ్లబండిపై సిరికొండ గ్రామానికి వెళ్ళి అక్కడ కుండలు చేసే కుమ్మరి వారికి చెపుతారు. వారు తరతరాల నుండి కుండలు చేయడం ఆచారంగా వస్తున్నది.

పుష్యమాసం పౌర్ణమి అయిన తెల్లవారు జామున గోదావరి నదీ జలాలు తీసుకురావడానికి ప్రయాణమవుతారు. ఆధునిక కాలంలో ఎన్నో రకాల సదుపాయాలున్నా, 75 కిలోమీటర్లు వీరు కాలినడకనే వెళ్తారు. జన్నారం మండలం కలమడుగు గ్రామ సమీపాన గల హస్తీన మడుగు నుండి నీటిని తీసుకువస్తారు. ప్రయాణం చేయు సమయంలో గ్రామ పొలిమేరలో బస చేస్తూ వెళ్తారు. గ్రామ ప్రజలు వీరికి కావలసిన ఆహార పదార్థాలు సరఫరా చేస్తారు.

గోదావరి నీటిని తీసుకుని తిరుగు ప్రయాణంలో ఇంద్రవెల్లిలోని ఇందూర్ ఆయి వద్ద పూజ చేసి, అమావాస్య కన్నా ఐదు రోజులు ముందు కేస్లాపూర్‌లో మర్రిచెట్టు వద్ద వుంటారు. అక్కడ ఐదు రోజులు ఆగకుండ డోలు, సన్నాయి, కీక్రి వాయిద్యాలు వాయిస్తారు.

అమావాస్య రోజు : మూడు గంటల ప్రాంతంలో మర్రి చెట్టు నుండి ఆలయ సమీపంలోని గోవాడ్ నివాస స్థలమునకు చేరుకుంటారు. ఆలియలో అల్లుళ్ళు, కూతుళ్ళు భేల వేస్తారు. సాయంత్రం 9 గంటల ప్రాంతంలో ఆలయమును గోదావరి నదీ జలాలతో శుద్ధి చేసి పూజ ప్రారంభిస్తారు.

ఐదు రోజులూ ప్రత్యేకమే

నాగోబా జాతరకు ఎంతో ప్రాధాన్యత ఉంది. రాష్ట్ర పండగగా గుర్తించిన అనంతరం ఎంతో కొంత అభివృద్ధి ఈ ప్రాంతంలో కనిపిస్తోంది. అయితే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత మొదటిసారి నాగోబా జాతర జరుగుతోంది. ఐదు రోజుల పాటు జరిగే జాతరకు ఏ రోజుకారోజు ప్రత్యేకమే. ఈ సారి నిర్వహించే దర్బార్‌కు ముఖ్యమంత్రి కెసిఆర్ కూడా వచ్చే అవకాశాలు ఉన్నాయి.

ఈ నెల 19న అమావాస్య రోజున గంగాజలంతో తెచ్చిన నీటితో నాగోబా విగ్రహాన్ని శుభ్రపరుస్తాం. గిరిజన సాంప్రదాయ వాయిద్యాలైనా డోల్, తుడుం, కాలికోం, సన్నాయిలను మోగిస్తూ పూజలను ప్రారంభిస్తాం. నాగోబా ఆవరణలో పాలు, నైవేద్యం సమర్పిస్తాం. కలెక్టర్, ఐటిడిఎ పిఓ హాజరై అధికార లాంఛనాలతో జాతరను ప్రారంభిస్తారు.

20న వధువుల పరిచయ వేదిక నిర్వహిస్తారు. మెస్రం వంశస్తులు పెళ్లయిన నూతన వధువులను కెస్లాపూర్‌లోని నాగోబా దగ్గరకు తీసుకెళ్లి పూజ చేసిన అనంతరం మెస్రం పెద్దలకు పరిచయం చేస్తారు. దీనిని భేటింగ్‌కీవాల్ అంటారు. ప్రతి మెస్రం ఆడపడుచు ఈ నాగోబా సన్నిధిలో భేటింగ్ చేసిన అనంతరమే వారిని కోడలుగా స్వీకరిస్తారు.

మూడు రోజు ఈ నెల 21న ఇచ్చోడ మండలం సిరికొండ నుండి తెచ్చిన మట్టి కుండల్లో నవ ధాన్యాలు బెల్లం, పప్పు, పిండి, బియ్యంతో నైవేద్యాన్ని తయారు చేస్తారు. కుల దేవతలకు మొక్కి నైవేద్యాన్ని సమర్పిస్తారు.

నాలుగో రోజున ప్రజాదర్బార్ నిర్వహిస్తారు. ఈ దర్బార్‌కు జిల్లా అధికారులతోపాటు మంత్రులు హాజరవుతారు. ఆదివాసులు ఎదుర్కొంటున్న సమస్యలను విని అక్కడికక్కడే పరిష్కరించడం ఆనవాయితీ. ఈ సంవత్సరం జరిగే దర్బార్‌కు ముఖ్యమంత్రి కెసిఆర్‌ను గిరిజన సంఘాల నాయకులు ఆహ్వానించారు. ముఖ్యమంత్రి కెసిఆర్‌తోపాటు జిల్లా మంత్రులు జోగురామన్న, ఇంద్రకరణ్ రెడ్డిలు హాజరయ్యే అవకాశాలున్నాయి.

చివరి రోజు ఈ నెల 23న పెర్సాపేన్ పూజలు చేసిన అనంతరం పూందోన్ సంప్రదాయ కార్యక్రమం నిర్వహిస్తారు. గిరిజన సాంప్రదాయం ప్రకారం కర్రసాము ఆట ఆడి నాగోబా జాతరకు ముగింపు పలుకుతారు. అక్కడి నుండి ఉట్నూర్ మండలంలోని శ్యాంపూర్‌లోని బుడుందేవ్ జాతరకు పయనమవుతారు.

– మెస్రం తుకారాం, ఆలయ కమిటీ ఛైర్మన్

భేటింగ్ వధు పరిచయ వేదిక : మెస్రం వంశంలో గోండు, ప్రధాన సంతానంగా వివాహం అయిన వధువును మొత్తం మెస్రం తెగ వారికి పరిచయం చేస్తారు. ఎంత వరకైతే ఈ పరిచయ – బేటింగ్ కారో అంత వరకు మెస్రం తెగ వధువు దేవుని చూడటానికి వీలులేదు.

మూడవ రోజు దర్బార్ కార్యక్రమం : కొమురం భీం మరణానంతరం ఆదివాసుల స్థితిగతులపై అధ్యయనం చేయడానికి వచ్చిన మానవ పరిణామ శాస్త్రవేత్త ప్రొఫెసర్ హైమాన్‌డార్ఫ్ ఆదివాసులు ఎక్కువ మంది జమ అయ్యే కేస్లాపూర్ జాతర 1941లో ఏర్పాటు చేశారు. అప్పటి నుండి నేటి వరకు పరంపరగా కొనసాగుతుంది. ఆదివాసుల అర్జీలను పరిష్కరించడం జరుగుతుంది. ఈ దర్బారుకు వివిధ శాఖల అధికారులు విధిగా హాజరు అవుతారు. జిల్లా యంత్రాంగం మొత్తం వస్తారు.

కేస్లాపూర్ నాగోబా సంతానం లేని వారికి సంతానం కలుగజేస్తుందనే భావన భక్తులకు వుంది. ఎవరికైతే సంతానం కాదో వారు మొక్కుతారు. సంతానం అయిన పిదప వెండి ఉయ్యాలలను తయారు చేయించి హుండీలో వేస్తారు. ఈ జాతరకు మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్, మధ్య ప్రదేశ్, ఆంధ్రా, తెలంగాణ, ఒరిస్సా రాష్ట్రాల నుండి గిరిజనులు, గిరిజనేతరులు దాదాపు రెండు లక్షల మంది వరకు హాజరవుతారు.

ఆదివాసుల సంస్కృతి సాంప్రదాయ కేంద్రంగా అందరి కోరికలు తీర్చే నాగోబాగా కేస్లాపూర్‌లో శ్రీ శేఖల్ ఆదిశేషుడు పూజలందుకుంటున్నాడు. కనుకనే నాగోబా జాతర ఆదివాసుల మహోత్సవంగా పేరు గాంచింది. దాదాపు అరవయ్యేళ్ళ పై బడి జరుగుతున్న దర్బారుకు రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరవుతున్నారు. ప్రభుత్వమే అధికారికంగా ఈ ఉత్సవాల్ని నిర్వహిస్తోంది.

– మెస్రం మనోహర్,

ఆదివాసీ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ

బాక్స్ ఐటమ్ : రాపర్తి దత్తాత్రి

■ కథ : మల్లేపల్లి ప్రమోద్ కుమార్

ఊరెన్క గొర్ల మందల గొర్లన్ని ఏదో ప్రళయం ముంచుకొచ్చినట్టు ఒక్కటే అరుస్తున్నయి. మంద కావలున్నకుక్కలు 'భౌభౌ'మని విరామం లేకుండా మొరుగుతున్నయి. వాటి లొల్లికి నులక మంచం మీద పండుకున్న శంకరయ్య తాతకుమేల్కొచ్చి లేసి కూసున్నడు. 'హయ్ హయ్' అని ఒకసారి గట్టిగా గదమాయించి, నిదానంగాసుట్ట ముట్టిచ్చుకోని ఒక్క దమ్ములాగి, నిద్ర మబ్బు పోంగనే చేతి కట్టె పట్టుకోని 'హయ్ హయ్'అని అదిలిచ్చుకుంటదొడ్డి అంత కలెదిరుగుతున్నడు.

ఆ ఊర్లనే పెద్ద మంద శంకరయ్య తాతది.వెయ్యి జీవాలకు పైననే ఉంటయి అయితే గియితే అటువంటి పెద్ద మందలనేదొంగతనం జెయ్యాల్నని ఒక దొంగోడు ఆ మందలకొచ్చి దాక్కున్నడు. మందల కలకలమంతఆడొచ్చినందుకే !శంకరయ్య మందఅంత కలెదిరుగుతున్నడు. గొర్ల నడుమ నక్కిన ఆ దొంగోనికి గుండె దడదడలాడుతుంది. శంకరయ్య కట్టె ఆని మూతికాడికొచ్చిఆగిపొయ్యింది. శంకరయ్య కుక్కల్ని 'హయ్ హయ్'అని గదిరిచ్చిండు. ఆ గదిరింపుకు మెల్లెగ 'కుయ్ కుయ్'మనుకుంట కుక్కలుఅరుపు మానినయి.

మనిషితనం

శంకరయ్య మల్ల వొయ్యి మంచం మీద జెరసేపు కూసోని, సుట్టంత కాల్సి పడేసి పండుకున్నడు. ఆయిన పండింది చూసి దొంగోడు ఓ వాటమైన గొర్రెను భుజాలమీదేస్కోని మెల్లెగ జారుకున్నడు.మల్ల మందంత కలకలంమొదలైంది.శంకరయ్యకిఇసుకొచ్చి పండుకున్నతాన్నుంచే, "ఏమైందే మీకు? నాకు కనవడని దయ్యాలు మీకు బలెగనవడుతున్నయి పండుకోండ్రి" అనిగదిరిచ్చిండు. కుక్కలు మొరిగినంతసేపు మొరిగి అలిసి పండినయి.

శంకరయ్యకిట్ల నిద్ర పట్టిందో లేదో తెల్లగ తెల్లారిపొయ్యింది. పిట్టెల అరుపులకు, కాకుల గోలకు గులుగుకుంట లేసికూసున్నడు. కుక్కలు శంకరయ్య దగ్గరికొచ్చి మీదమీద పడుతున్నయి. "ఎహె పోండ్రి రాత్రంతనిద్రలేకుండ జేసి ఇప్పుడేమొ ముద్దుగ మీదమీద పడుతున్నరు. అక్కడ నడువుండ్రి" అనుకుంట కుక్కలను ఎలగొట్టిండు. కుక్కలు అదేమి పట్టిచ్చుకోకుండశంకరయ్యమీద పడుతనే ఉన్నయి. అవిటిని కసికొద్ది ఎలగొట్టిండు.ఏమనుకున్నయో ఏమోగాని మెల్లెగ పక్కకు పొయినయి.

శంకరయ్య మంచం దిగి, కమ్మలకత్తి తీసుకోని, బయిటున్న యాపచెట్టు నుంచి ఓ కొమ్మ తెంపుకోని ఆకులుగొర్లకేసి,పుల్ల నోట్ల పెట్టుకోని పండ్లు తోముకుంట, దొడ్డికి తడక అడ్డమేసి, ఇంటి ముఖమైపోతున్నడు. ఎన్కంగనే కుక్కలొస్తున్నయి. తానెంత ఇసుక్కున్నా పట్టిచ్చుకోకుండ తనెంటనే వస్తున్న కుక్కల దిక్కు జాలిగ చూసి, వాటినెత్తులు నిమిరిండు.

పోతపోత ఒక ఇంటి బయట, సాకలి సత్తిగాడు ఇంకా గుర్క పెట్టుకుంట పండుకున్నది చూసి, "తెల్లారిఎంతసేపయ్యిందిఇంకా నీ పండుకమేందిరా లే!" అనుకుంట చేతి కట్టెతోటి ఎన్క ఒక్కటేసిండు.

సత్తిగాడు చెంగున లేసి కూసోని, శంకరయ్య దిక్కు చూసి, "నీవా శంకరయ్య తాతా ! నీకు రోజు రోజుకుపరాశ్కమెక్కువైతుందే!" అనుకుంట కండ్లు నలుసుకుంటున్నడు.

బోసినోటితోటి నగుకుంట పోతున్నడు శంకరయ్య.

ఎదురుగ బోయ చెంద్రమ్మ సంకల బిందె పెట్టుకొని వొస్తుంటె, "ఏం పిల్లా! నీ వొయ్యారం జూస్తుంటె రాత్రిజాగారమేఅయినట్టుండది!" అన్నడు.

"ఏం శంకరయ్యతాతో సోకెక్కువయ్యింది నీకు"అని నగుకుంట పొయ్యింది.

అంతలోనే పక్కింటి నుంచి అంబలి వాసన కొట్టింది. మెల్లెగ శంకరయ్య అక్కడ తిరిగిండు. "ఓ పిల్లా!అంబలి పొద్దుగాల కాస్తుండవేమే! యాడికోతుండవు?"

"ఎవరది?" అన్నది లోపలినుంచి మంగలి అనుసూయ.

"నేనే నీ మొగున్ని!' 'అనుకుంట ఇంట్లకొయ్యిండు. ఎన్కంగనే అనుసూయ మొగుడు నర్సింహ్మ "ఏం తాతా!ఇయ్యాలమాంచి జోష్ మీదుండవు?" అనుకుంట వొచ్చిండు.

"నేను జోష్ మీదుండనిదెప్పుడురా మనుమడా!"

"నీవా శంకరయ్యతాతా! దాదా కూసో!" అన్నది అనుసూయ.

"ఇయ్యాల అంబలి నీతాన్నే సూడు బిడ్డా!"

"తాగు తాతా! దానికేం భాగ్యం!"

మెల్లెగ అనుసూయ తల నిమిరి, "నీ ముఖం అచ్చం మీ అవ్వ ముఖం లాకనే ఉంటదే! అందుకే అట్లంటఏమనుకుకోకు బిడ్డా!" అన్నడు.

"అయ్యో ఊకో తాతా! నీ గురించి నాకు తెల్వదా ఏంది?" అన్నది ప్రేమగా.

ఆల్లింటికాన్నే ముఖం కడుక్కోని కడుపునిండ అంబలి తాగిండు శంకరయ్య. " నీ కడుపు సల్లగుండని బిడ్డా!ఉడుకుడుకు అంబలి తాపిచ్చినవు. ఓ మా ఇంట్ల చెయ్యమంటే మా కోడండ్లకేమో అంబలి జెయ్యనీకె రాదాయె!ఏమనొస్తది చెప్పు"

"ఈకాలం పిల్లలకేడొస్తది తాతా!"

"గంతే పటు ! ఇగ పోతరా! మల్ల గొర్లనేసుకపోవాలె" అనుకుంట బయిటికెల్లిండు. జెర్ర దూరం పొయ్యిండో లేదో "ఓపిల్లా ఏం జేస్తుండవే!" అనుకుంట ఇంకో ఇంట్లకొయ్యిండు.

"ఎవరది?....... నీవా శంకరయ్యతాతా దాదా!" అనుకుంట నిండు పొట్టతోటున్న గొల్ల మంగ బయిటికెల్లింది.

"ఏమంటున్నడే నీ కడుపుల మా నాయిన?"

"ఏమనుకమో ఏమో పోవే! ఆ పిల్లకు కనే పొద్దులు తాతా! పట్నం దావఖాన్లకు తోల్కపోవాల్నంట.ఈ కాలముల్లకాన్పులు ఇండ్లల్ల జెయ్యొద్దంటున్నరు. పైసలేమో ఐదువేలు గావాల్నంట. పిలగాడు పొద్దుగాల పొయ్యిండు పైసలకోసం.ఎట్లయితదో ఏమోనే!" అన్నది మంగ అత్త చెంద్రమ్మ.

"ఏమయితదే! దాని కడుపుల ఉన్నదెవరనుకుంటుండవు? మా నాయిన. మా నాయిన దేవుడు. ఆల్లమ్మను సల్లగ సూసుకుంటడు. ఇగో రాత్రి నా పెద్దకొడుకు ఈ గోలీలిచ్చిండు. ఈ టైంల ఇవేసుకుంటె బలమంట పటు. రోజుకొకటంటఏస్కో" అని కొన్ని గోళీలిచ్చిండు.

"ఇగ నేను పోతరా! ఇంటికోవాలె" అనుకుంట బయిటికెల్లిండు. ఆన్నే బయిట గుంజకు కట్టేసిన ఓ గొర్రెనుచూసి,"ఈగొర్రెక్కడిదిరో కొత్తగ కనవడుతున్నది?"అన్నడు.

అప్పుడే మంగ మొగడు మల్లయ్య బయిటికెల్లొచ్చి ,"ఓ ఇదా శంకరయ్యతాతా! రాత్రి మా బామ్మర్ది పంపిండుఎవరికన్నఅమ్మి పైసలు తీస్క రమ్మన్నడు" అని చెప్పిండు.

"అట్లనా! ఎవనికో ఎందుకురా! నాకే అమ్మరాదు."

"ఊకో తాతా! నీకెందుకు? ఇప్పటికే బొచ్చెడన్ని గొర్లున్నయి నీతాన. ఈ గొర్రెను నీవేం జేసుకుంటవు?"

"అరే మల్లిగా! నా బిర్రే అదిరా! ఈ సుట్టుముట్టు ఊర్లల్ల నాతాన ఉన్నన్ని గొర్లు ఎవరితాన ఉండొద్దు. అది నా కాయిశు (కోరిక). అందుకే అడుగుతుండ నాకే ఇచ్చెయ్. ఎంతకమ్ముతవు చెప్పు." అని గొర్రెను పట్టి సూసిండు.

"ఆ ఎంత తాతా! నీతాన ఎక్కువ తీసుకుంటాను. ఓ మూడు వేలియ్యిపో!"

"అరే సోయి తప్పినోడా! గొర్రె ఎట్లుండది? కటికోనికేస్తే పదిహేను కిలల యాటరా ఇది. మీబామ్మర్దిని ముంచుతవా ఏంది? ఐదువేలకు తక్కువకు రాదు. ఇగవటు ఐదువేలు" అని బొడ్లో దోపుకున్న బట్టసంచిలకెల్లిఐదువందల నోట్లు పది లెక్కపెట్టిచ్చిండు.

మల్లయ్య నోరెల్లవెట్టిండు. 'అసలు సోయి తప్పినోన్ని నేనుగాదు – నీవు! నీ మందలకెల్లి దొంగులుకొచ్చినగొర్రెను నీవే గుర్తు పట్టకపోతివి. మీదంగ మూడు వేలియ్యమంటే ఐదు వేలంటని ఇస్తివి. నీ అంత సోయిదప్పినోడెవ్వడు లేడు. మల్ల మీదంగ నన్నే సోయి దప్పినోడంటున్నావు?' అనుకున్నడు మనుసుల. సటుక్కున ఐదువేలందుకోని జేబుల కుక్కుకున్నడు.

"మల్లిగా!ఇంటికొయ్యి వొచ్చేటప్పుడు ఈ గొర్రెను కొట్టుకపోతగాని ఉండని" అనుకుంట ఇంటికి పొయ్యిండుశంకరయ్యతాత.

"సరే పో తాతా!" అనుకుంట ఇంట్లకొచ్చి, "అమ్మా నీ కోడలిని తయారుజెయ్యే. పట్నం దావఖానకుతోల్కపోదం పైసలొచ్చినయి" అంటడు.

"ఇంత జప్పున నీకేడ దొరికినయిరా పైసలు?" అనడిగింది చెంద్రమ్మ.

"ఏన్నో ఓతాన దెచ్చినగాని. నీకెందుకే! మీరయితే తయారు కండ్రి" అనుకుంట మల్ల బయిటికొయ్యిండు.

శంకరయ్య ఇంటికి పోంగనే,"ఏమయింది మామా!ఇయ్యాల ఇంత లేటయ్యింది?"అన్నది పెద్దకోడలు జానకి.

"వొస్తొస్త ఆ గొల్లమల్లిగానితాన ఓ గొర్రెను కొనుక్కోని ఒస్తున్నమ్మ. అందుకే లేటైంది"

"ఎవరు ఆ దొంగ మల్లిగానితాన్నా? ఆడు ఆ గొర్రెను ఎవనితాన ఎత్తుకొచ్చిండో ఏమో! ఐనా మనతాన్నే అంతమందుంది. అవే అమ్మేతమని సూస్తుంటే ఇంకెందుకు కొన్నవే?" అన్నడు పెద్ద కొడుకు రవి.

"అట్లంటవేందిరా! నేనున్నన్ని దినాలు ఆ మందజోలికి ఎవ్వడొచ్చేది లేదు. సదువుకునే పోరగాల్లు ఆడెవడోఅలెగ్జాండరోఎవడో ఒక్కొక్కరాజ్యం గెలుసుకుంట ఆని సామ్రాజ్యం పెంచుకున్నడని చెప్తరుసూడు. అట్ల నేను గుడఒక్కొక్క గొర్రెను కొని నామందను పెంచుకుంట పోత. నా మని ఉండంగ ఆ మందనమ్మేదే లేదు. నేను వొయినంకదాన్నమ్మి మీరు ముగ్గురన్నదమ్ములు సమంగ పంచుకోండ్రి" అన్నడు కోపంగా.

"అంత కోపమయితవేమే! ఈ శాతగాని పానానికి ఎండల్ల దిరుగుకుంట, రాత్రిపూట ఒక్కనివి పండుకుంటఎందుకుంటవని అన్న. మేము ముగ్గురం ఏదో ఒకటి చేసుకుంట మంచిగనే ఉన్నంగద! నీవు కష్టం చేస్తేనే పెద్దమాఏంది? ఊకె సల్లగ ఇంటికాడ కూసుంటవిని చెప్తున్న"

"లేదురా రవీ! నాకు ఆ పచ్చటి ప్రకృతమ్మ ఒడిలనే మంచిగుంటదిరా! మనుసుల్ల లేని నీతి నిజాయితేందోఈ జీవాలల్లనే ఉన్నట్టనిపిస్తది. సల్లటిగాలి సెవుల పోంటి పోతుంటే మీ అమ్మ పల్కరిచ్చినట్టే ఉంటదిరా! నాకు మీలాక బెడ్డుమంచాల మీద పండేకంటే దొడ్డ్య నులకమంచం మీద పండితెనే మంచిగ నిద్రొస్తదిరా!"

శంకరయ్య మనుసు పోయిన ఆయిన భార్య మీదికోతుందని గుర్తుపట్టి, "పోన్లే మామా అట్లే జేతువుగాని రొట్టెతిందువుగానిరా" అని పిలిచింది జానకి. ముగ్గురు కల్సి ముచ్చట్లాడుకుంట జొన్నరొట్టెలు తిన్నరు.

రెండు రోజులకు మంగకు పండంటి మగబిడ్డ పుట్టిండని తెల్సింది. శంకరయ్య పొయ్యి పిలగాన్ని సూసి,తల్లిని పల్కరిచ్చి, పిలగాని సేతుల ఓ వెయ్యి రూపాయలనోటు వెట్టి ఒచ్చిండు.

ఆ పిలగాని పురుడు పండుగ జెయ్యనీకె అందరు ఆలోచన జేస్తున్నరు. మల్లయ్యకైతే మల్ల పైసలేడ దేవాల్నోతెలువకపరేశాన్ అయితున్నడు. అంతలనే శంకరయ్యతాత యాదికొచ్చిండు. అవును మల్ల శంకరయ్యతాత మందలమల్లో గొర్రె పిల్లనుఎత్తుకరావాలె. ముందుకే ముసలోడు. ఆని మందలెన్ని గొర్లున్నయో ఆనికే లెక్కదెల్వదు. ఏంలేనోడా అంటే అదేంగాదు. పెద్దకొడుకుఆరంపి డాక్టరు. నడిపోడు పట్నంల గవర్నమెంటు కొలువు, చిన్నోనికి ఊల్లెనేపెద్ద కిరాణం దుకానమున్నది. ఏంబొయ్యేదున్నది. గానుగుల గంటెడు.అది పొయ్యింది దెల్వదు ఉన్నది దెల్వదు.అనుకోని మల్ల ఆ రాత్రికి దొంగతనానికి ప్లాన్ ఏసిండు.

ఇంతకు ముందులాకనే మధ్యరాత్రి దాటినంక మందల జొర్రిండు. మల్ల మందల కలకలం, కుక్కల మొరుగుడుమొదలయ్యింది. శంకరయ్య మందంత కలెదిరిగి కుక్కల మీద గులుగుకుంట పండుకున్నడు.శంకరయ్య పండంగనే మల్లయ్యఓ పెద్ద గొర్రెను జూసి ఎత్తుకోని పొయ్యిండు.

తెల్లారినంక శంకరయ్య ఇంటి ముందలికెల్లి పోతుంటే, "ఓ శంకరయ్యతాతా! మల్లో గొర్రె పిల్లొచ్చింది.తీస్కుంటావే!" అని అడిగిండు మల్లయ్య.

"ఏంరో!ఈనడుమ గొర్ల యాపారమేమన్న మొదలువెట్టినావురా!గొర్లు బాగ అమ్మవడ్తివి"అనుకుంట వొచ్చిండు.

"ఏంలేదు తాతా! మా బామ్మర్ది అప్పుడప్పుడు గొర్లు మారు బ్యారానికి దెస్తడు.ఆనికి అమ్మనీకె శాతగాదు.అందుకే నన్నమ్మి పెట్టమంటడు"

"అట్లనా! ఇంతకు బ్యారమెంత?"

"నీకు దెల్వనిదేముంది తాతా! ఎంతనో ఇచ్చి తీస్కపోరాదు!" అన్నడు అభిమానం నటిస్తూ.

"ఇగవటు ఐదువేలు" అని పైసలిచ్చి, "నా మందల ఇంకో గొర్రె జమయ్యింది" అని మీసం మెలేసుకుంట గొర్రెను కొట్టుకపొయ్యిండు.

'ఎడ్డి శంకరయ్య!' అని శంకరయ్య తెలివికి నవ్వుకుంట ఇంట్లకు పొయ్యిండు మల్లయ్య.

మల్లయ్యకు ఎప్పుడు పైసల అవసరం పడితె అప్పుడు శంకరయ్య మందల దొంగతనం జేస్కం – మల్ల శంకరయ్యకే అమ్ముకం అలవాటు జేసుకున్నడు.

ఒకరోజు శంకరయ్యకి బాగ జరమొచ్చింది. ఒకదిక్కు దగ్గు దమ్ము.

అండ్ల జరం అనెవరకు ముసలాయిన పానం వొశపోతలేదు. కొడుకులు, కోడండ్లు ముసలాయినను కంటికి రెప్పలాగ చూసుకుంటున్నరు. ఆరోజు రాత్రిగొర్లమందకాడపండుకోనీకె చిన్నకొడుకు శ్రీరాములు పొయ్యిండు.

పొయ్యి పొయ్యి ఆయల్లనే మల్లయ్య దొంగతనానికి మందల దూరిండు. కావలి పండనీకె వొచ్చినశ్రీరాములునుసూడంగనే ఆని పై పానం పైననే పోయినంత పనయ్యింది.'వార్నీ ఈ ముసలోనికేమయ్యిందిరానాయినా ! ఏదో ఎడ్డిమాలోకం.ఎర్రి శంకరయ్యను చూసి దొంగతనాలు అలవాటు జేసుకుంటే ఇయ్యాల ఈడొచ్చెనేమిరా దేవుడా!ఇగ ఈని కంట్ల వడితె ఏమన్నుందా? నా తోడ్కలు (తోలు) దీస్తడు' అనుకోని భయంభయంగమసులుతున్నడు. ఎప్పుడు పసిగట్టినయో ఏమో కుక్కలుభౌన మొరుగుడు షురువు జేసినయి. అంతే... ఆని లాగుతడుసుడొక్కటే తక్కువ.

ఆ పిలగాని పురుడు పండుగ జెయ్యనీకె అందరు ఆలోచన జేస్తున్నరు. మల్లయ్యకైతే మల్ల పైసలేడ దేవాల్నోతెలువకపరేశాన్ అయితున్నడు. అంతలనే శంకరయ్యతాత యాదికొచ్చిండు. అవును మల్ల శంకరయ్యతాత మందలమల్లో గొర్రె పిల్లను ఎత్తుకరావాలె. ముందుకే ముసలోడు. ఆని మందలెన్ని గొర్లున్నయో ఆనికే లెక్కదెల్వదు. ఏంలేనోడా అంటే అదేంగాదు. పెద్దకొడుకు ఆరంపి డాక్టరు. నడిపోడు పట్నంల గవర్నమెంటు కొలువు, చిన్నోనికి ఊల్లెనే పెద్ద కిరాణం దుకానమున్నది. ఏంబొయ్యేదున్నది. గానుగుల గంటెడు. అది పొయ్యింది దెల్వదు ఉన్నది దెల్వదు. అనుకోని మల్ల ఆ రాత్రికి దొంగతనానికి ప్లాన్ ఏసిండు.

శ్రీరాములు లేసి "హయ్ హయ్" అని అదిలిచ్చుకుంట, బ్యాట్రి ఏసుకుంట, కట్టె వట్టుకోని సక్కగ మల్లయ్య ఉన్నదిక్కేనడుసుకుంట వొస్తున్నడు.ఇగ అయిపాయెరా నాపని అనుకున్నడు మల్లయ్య. బ్యాట్రి లైటు సరిగ్గా అతనిమీద పడబోతుండనంగా "ఒరే సిన్నోడా! శీరాములూ!"అన్న పిలుపు వినిపించి ఎనిక్కి తిరిగి సూసిండు శ్రీరాములు.

ఎన్క – శంకరయ్య ! ఆ సమయంలో తండ్రిని అక్కడ చూసి ఆశ్చర్యపోతూ, " అదేంది నాయినా ! జరమొచ్చింది ఇంటికాడ పండుకోమని అంటే మల్లొచ్చినవేందే!" అనుకుంట తండ్రి దగ్గెరికి పొయ్యి పట్టుకోని తోలుకొచ్చి, మంచం మీద కూసోవెట్టిండు.

"ఇగ నీవు వోరా శీరాములూ!" అన్నడు శంకరయ్య ఆయాసపడుకుంట.

"నీవింత సుస్తల ఉండవు. ఎందుకొచ్చినవు నాయినా! నేనున్న గద!"

"ఈరోజు నేనే పండుకోవాలె బిడ్డా!"

"అదేంది నాయినా అట్లంటవు?"

"అవునురా! ఈ రోజు ఓ దొంగోడొస్తడు. నీవుంటే ఆనికి దొంగతనం జెయ్యనీకె సందు దొర్కదు. అందుకే నేనే పండుకోవాలె."

"ఏమయింది నాయినా నీకు? జరం నుంచి పైచ్చం గిన అయిందా ఏం? ఏందేందో మాట్లాడుతుండవు?"

"పైచ్చంగాదు ఏంగాదురా! తెలివి మీదనే ఉండి మాట్లాడుతున్న. రేపు మన మల్లిగాడు,కొడుకు తొట్టెల పండుగజేస్తున్నడు. పండుగ జెయ్యనీకె ఆనితాన పైసలు లేవు. ఆనికి పైసలు అవసరమున్నప్పుడల్ల మనమందలకెల్లి ఒక గొర్రెనెత్తుకపొయ్యి మల్ల నాకే అమ్ముతడురా! నాకు దెల్వనట్టే ఆని తాన ఆని అవుసరాన్ని బట్టిఆనికి పైసలిచ్చి నా గొర్రె నేనే కొంటుండరా!ఆ విషయం ఆనికింక దెల్వదు. రేపు తొట్లె పండుగకోసం ఆడు ఖచ్చితంగ దొంగతనానికొస్తడు. నీవుంటె పరెషాన్ అయితడుపోరా!"

"ఏంది నాయినా!ఆడు దొంగతనం జెయ్యనీకె వొస్తడని తెలిసి, ఆనికి సాయం జేతమని ఇంత సుస్తుల గుడవొచ్చినావు?ఎందుకు నాయినా నీకందరిమీద ఇంత ప్రేమ?"

"అరే శీరాములూ! నాకు మీరు ముగ్గురు కొడుకులేరా! మల్లిగాని పెండ్లాం మంగమ్మను సూసినప్పుడల్లానాకు నా బిడ్డెలాకనే అనిపిస్తదిరా! అందుకే నా బిడ్డెకు పెడ్తున్న అనుకుంటుండరా!"

శంకరయ్య మాటలు వింటున్న మల్లయ్యకు మతి పోయినంత పనయ్యింది. కళ్ళల్లో నీళ్ళు నిండినయి.

"సరేగాని నాయినా! నీవెట్లా పెట్టదలుసుకున్నవు. అదేదో డైరెక్ట్‌గ పెట్టొచ్చుగదనే! ఆడు దొంగతనం జేసిందాక ఆగుడెందుకు?"

"పైస ఊకె రాదు. కష్టపడితెనే పైసలొస్తయని ఆనికి పైస ఇలువ తెల్వనీకె అంతసేపు ఆగుతున్నరా!"

"అట్లయితే ఆడు దొంగతనం జెయ్యనీకె నీవే కారణమయితుండవు గదనే! అది తప్పు గద నాయినా!"

"బిడ్డా! నేను మీలాక సదువుకోలేదురా! నీ ప్రశ్నలకు సమాధానం జెప్పనీకె. నాకు ఒకటే తెలుసు నేనుఆ మల్లిగానికిసాయం జెయ్యాలె. ఆనికి గుడ ఏదో ఒకరోజు దొంగతనం తప్పు అన్న ఇషయం అర్థమయితది.అప్పటివరకు ఎదురుసూతం"

అదంత వింటున్న మల్లయ్య, ఇక ఆగలేక తాను దాక్కున్న చోటినుండి పరిగెత్తుకుంటూ వచ్చి శంకరయ్యకాళ్ళమీద పడి, "శంకరయ్యతాతా! నన్ను మన్నించు. ఇన్నిరోజులు నీకు దెల్వకుండ దొంగతనం జేస్తున్న అనుకున్న గానీ, నీవు అన్ని దెలిసే నాకు సాయంజేస్తున్నవని ఎర్కవట్టలేదే! నన్ను కొట్టుతాతా! నా పాపానికి శిచ్చ ఎయ్యి తాతా!"అంటూ ఏడుస్తున్నడు.

"అరే మల్లిగా! ఎప్పుడొచ్చినవురా! నీవు లేవేమో అని ఇదంతజెప్పి నీ మనసు కష్టపెడితి గద బిడ్డా!"

"నన్ను తన్ను తాతా! లేకపోతె నాకు బుద్ధిరాదు"

"అరేయ్ నీ తప్పేందో నీవు తెలుసుకున్నవు. అంతే సాలు. ఇంకోసారి చెయ్యవు. నీవిప్పటి నుండి దొంగతనాలు మాని మంచిగ పని చేసుకో. కష్టపడి సంపాయించిన పైసల మీదికి తప్పుజేసి సంపాదించినవి రావురా!కష్టపడిన దాంట్ల తృప్తి ఉంటది. దొంగతనం జేసిన దాంట్ల ఎప్పుడేమైతదో అనే భయముంటది"

"ఊరంత నన్ను దొంగోడనుకుంటుంటే నాకు పనెవరిస్తరు తాతా!" అన్నడు బాధగా.

"ఎవరో ఎందుకురా! నాకు గుడ శాత గాకుండ అయితుండది. ఈ మందను నీవే సూస్కో నెలకు జీతంతీసుకో!"

"శంకరయ్యతాతా! నీవు దేవునివే! రేపటినుంచి పనిలకొస్త తాతా!" అనుకుంట లేసిపోతున్నడు.

"అదేందిరా మల్లిగా! వొచ్చిన పని మరిసిపోతుండవు. ఓ యాట పిల్లనేస్కపోరా!"

"వొద్దు తాతా! సచ్చిన పామును ఇంక సంపకు. నాకు బుద్దొచ్చింది. ఇగ ఇప్పటి నుంచి అసొంటిపనులు జెయ్య"

"అరేయ్ దొంగతనం జెయ్యమంటలేనురా! నా మనుమని తొట్టెల పండుగకు దావతంత నాదే! అందుకే ఓవాటమైన యాటపిల్లనేస్కపొయ్యి ఊరొల్లందర్ని పిల్సుకరా!" అన్నడు.

శంకరయ్య తాత మనసుకు మల్లిగాని కండ్లల్ల నీళ్ళు దిరిగినయి. అతని విశాలమైన మనసుకు దండం పెట్టిఓ గొర్రెను భుజాల మీదేసుకోని పోతున్నడు. తన తండ్రిలోని మనిషితనానికి వినయంగా చేతులు జోడించినమస్కరించాడు శ్రీరాములు.

*

■ సంగీతం

కె. జె.ఏసుదాసుది విలక్షణ స్వరం. ఆయన పాడిన పాటలు ఒకసారి వింటే మళ్లీ మళ్లీ వినాలనిపిస్తుంది. శాస్త్రీయ సంగీతం ఎక్కువగా పలికే ఈయన స్వరం సినిమా పాటల్లోనూ అదే శైలి కనిపిస్తుంది. అయితే అందరు హీరోలకు అతికే గొంతు కాదాయనది. మోహన్‌బాబు వంటి కొద్ది మంది నటులకే ఆయన గొంతు అతికినట్లు వుంటుంది. శాస్త్రీయ సంగీతమే కాకుండా భక్తి పాటల ప్రైవేటు క్యాసెట్లు ఎక్కువగా పాడారు. వివిధ భాషల్లో నలభై వేలకు పైగా పాడిన ఆయన పాటల్లో కొన్ని...

విలక్షణ స్వర మాధుర్యం

కరుడు గట్టిన రౌడీని కూడా తన సహనం, మంచితనం, ఔదార్యంతో మనసున్నవాడిగా మార్చిన వ్యక్తికి దాసోహమంటారు ఎవరైనా. అలా జీవిత గమనాన్ని మార్చిన వ్యక్తి భార్య అయి, తనకో వారసుణ్ణి ఇవ్వబోతుంటే... ఆమె మీద అనురాగం వెల్లివిరుస్తుంది. అటువంటి సందర్భంలోదే మోహన్‌బాబు, శోభన నటించిన 'రౌడీ గారి పెళ్ళాం' చిత్రంలోని గురు చరణ్ సాహిత్యమందించిన "బోయవాని వేటకు గాయపడిన కోయిల, గుండె కోత కోసినా చేసినావు ఊయల. తోడులేని నీడలేని గూడులోకి వచ్చింది, ఆడతోడు ఉంటానని మూడుముళ్ళు వేయమంది" పాట. ఈ పాటకు సంగీతం బప్పీలహరి.

పగ ప్రతీకారాల ముందు బంధాలు, బంధుత్వాలు, ప్రేమ పాశాలు కనిపించవు. తరాలు మారినా తన, పర భేదం గుర్తుకు రాదు. ఎదుటివారి మీద ప్రతీకారం తీర్చుకోవాలన్న పంతంతో మనవరాలినే ఎరగా వేసి ఓడిపోతే... ఇలాంటి సందర్భంలోదే భానుమతి, జగపతిబాబు, సుకన్య నటించిన 'పెద్దరికం' చిత్రంలోని "ఇదేలే తరతరాల చరితం, జ్వలించే జీవితాల కథనం, పగేమో ప్రాణమయ్యేనా ప్రేమలే దూరమయ్యేనా, నిరాశే నింగికెగసేనా, ఆశలే రాలిపోయేనా" పాట. భువనచంద్ర సాహిత్యానికి రాజ్–కోటి సంగీతం అందించారు.

ఆశ నిరాశల మధ్య జరిగే జీవన పోరాటంలో మనసు వికలమై బతుకు సాగించే వ్యక్తి వ్యథ వేదాంతమై పాట రూపంలో వస్తే... శోభన్‌బాబు, జయప్రద నటించిన 'స్వయంవరం' చిత్రంలోని "గాలి వానలో.. వాన నీటిలో పడవ ప్రయాణం, తీరమెక్కడో గమ్యమేమిటో తెలియదు పాపం". దాసరి నారాయణరావు సాహిత్యానికి సత్యం సంగీతం అందించారు.

తాము అమితంగా ఇష్టపడే వ్యక్తి దూరమైతే ఎవరూ భరించలేరు. ఎప్పుడెప్పుడు వారిని చూద్దామా, వారితో మట్లాడదామా అనిపిస్తుంది. వారికోసం రాయబారాలు నడిపిస్తారు. ఆ మేఘాలతో పంపిస్తే... అలాంటి సందర్భంలోనిదే ఏయన్నార్, జయప్రద, జయసుధ నటించిన 'మేఘసందేశం' చిత్రంలోని "ఆకాశ దేశాన.. ఆషాడ మాసాన... మెరిసేటి ఓ మేఘమా విరహమో దాహమో విడలేని మోహమో.. వినిపించు నా చెలికీ మేఘ సందేశం" పాట. ఈ పాటకు రమేష్ నాయుడు సంగీతం,

వేటూరి సాహిత్యం సమకూర్చారు.

దిశా నిర్దేశం లేని వ్యక్తి జీవితంలోకి భార్యగా వచ్చి ఆ కుటుంబాన్ని గాడిలో పెట్టిన వ్యక్తి అనుకోకుండా ప్రమాదంలో పడినప్పుడు ఆమె భర్త చూస్తూ ఊరుకోగలడా? తన సేవలతో మళ్లీ ఆమెను కోలుకునేట్లు చేస్తాడు. ఆమె తనకు చేసిన మేలును మర్చిపోలేక పాట రూపంలో ఆలపిస్తే ఆ పాట ఇలాగే ఉంటుంది..."దారి చూపిన దేవతా నీ చేయి ఎన్నడు వీడక, జన్మ జన్మకు తోడుగా నా దానివై నువ్వు నడచిరా". మోహన్‌బాబు, జయసుధ నటించిన 'గృహ ప్రవేశం' చిత్రంలోని ఈ పాటకు సాహిత్యం మైలవరపు గోపి, సంగీతం సత్యం అందించారు.

బాధ్యతల్లేని అన్నకి తన ఇంట్లో స్థానం లేదని బయటికి గెంటేస్తుంది చెల్లెలు. నారు పోసినవాడే నీరు పోస్తాడు, పుట్టించిన వాడే ఏదో ఒక దారి చూపించి బతికిస్తాడు అనే వేదాంత ధోరణిలో అన్న పాడే పాట జయప్రద, రజనీకాంత్, కమల్‌హాసన్, శ్రీప్రియ నటించిన 'అంతులేని కథ' చిత్రంలోని "దేవుడే ఇచ్చాడు వీధి ఒకటి...ఇక ఊరేల సొంత ఇల్లేల ఓ చెల్లెలా.. ఏల ఈ స్వార్థం, ఏది పరమార్థం". ఈ పాటకు ఆత్రేయ సాహిత్యం అందించారు.

తోటి వారికి సహాయపడడం కనీస మానవ ధర్మం. కులం, మతం, వృత్తి పేరుతో కన్న తండ్రే మానవత్వాన్ని మర్చిపొమ్మంటే... మనుషులందరూ ఒక్కటే అని నమ్మే ఆ తనయుడి మనసు వ్యథ చెందుతుంది. ఆ బాధ కోపంగా మారి పాట రూపంలో బయటికి వస్తే చిరంజీవి నటించిన 'రుద్రవీణ' చిత్రంలోని "మానవ సేవ ద్రోహమా కళా సేవ కాదన్న, కన్నుల ముందు కదులు అభాగ్యుల చేరుటే దోషమా..." పాటలా వుంటుంది.

సిరివెన్నెల సాహిత్యం అందించిన ఈ పాటకు ఇళయరాజా సంగీతం సమకూర్చారు.

అత్తంటే ఆరళ్ళు పెట్టేది, కొడుకును తనకు దూరం చేసే వ్యక్తి అనుకునే అత్తలే కాదు, కొడుకు మృగంగా ప్రవర్తిస్తే తల్లిలా అక్కున చేర్చుకుని అండగా ఉండి ఆ కోడలికి మరో కొత్త జీవితం ఇవ్వడానికి తాపత్రయ పడే అత్తలూ ఉన్నారు అని తెలిపే చిత్రం వడ్డే నవీన్, మహేశ్వరి నటించిన 'పెళ్ళి'. ఇందులోని "అనురాగమే మంత్రంగా అనుబంధమే సూత్రంగా మమత కొలువులో జరుగు పెళ్లికి మంగళ వాయిద్యం... పలికింది ఆహ్వానం" పాటకు ఎస్.ఎ.రాజ్ కుమార్ సంగీతం సమకూర్చారు.

ఇలాంటి అరుదైన, మధురమైన పాటలతో శ్రోతలను అలరించి ఎన్నో జాతీయ పురస్కారాలు, నంది పురస్కారాలు అందుకున్నారు జేసుదాసు.

– బి.మల్లేశ్వరి

■ ప్రత్యేక వ్యాసం

నేతాజీపై కొత్త వివాదం!

భారత దేశ స్వాతంత్ర పోరాటంలోనూ ఆ తర్వాత కూడా ఎందరో గొప్ప నేతలు వున్నా దాన్నే పేరుగా నిలుపుకున్న ధీమంతుడు సుభాస్ చంద్రబోస్ ఒక్కరే. స్వాతంత్ర్య పోరాటంలో గాంధీజీ నాయకత్వాన్ని ధిక్కరించి నిలదొక్కుకున్న నేత ఆయన. బ్రిటిష్ ప్రభుత్వంలో ప్రతిష్టాత్మకమైన ఐసిఎస్ చదివి కూడా అన్నీ వదులుకుని స్వాతంత్ర పోరాటంలో దూకారు. గాంధీజీ విధానాలతో విభేదించి కాంగ్రెస్ అధ్యక్ష పదవికి పోటీ చేసి గెలిచారు.అప్పట్లో ఆయనకు కమ్యూనిస్టులు ఇతర అభ్యుదయ వాదుల మద్దతు లభించడం అందుకు కారణమైంది. అయితే



23 జనవరి 1897 - 18 ఆగస్ట్ 1945

ఆ విజయం తర్వాత ఆగ్రహించిన గాంధీజీ కాంగ్రెస్‌లో సంక్షోభం సృష్టించడంతో సుభాస్ బోస్ రాజీనామా చేసి బయటపడ్డారు. ఫార్వర్డ్ బ్లాక్ స్థాపించారు. 1940లలో రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో నాజీజర్మనీకి బ్రిటన్ శత్రుదేశం గనక ఆ దేశం సహాయంతో భారతదేశాన్ని విముక్తి చేయొచ్చని ఒక అవాస్తవమైన ఆలోచనచేసి హిట్లర్‌తో చేతులు కలిపారు. నక్క జిత్తులకు మారుపేరైన నాజీ హిట్లర్ తన దగ్గరున్న భారతీయ ఖైదీలను బోసుకు అప్పగించారు. వారితో రెండవ ఇండియన్ నేషనల్ ఆర్మీ(ఐఎన్ఎ) ఏర్పడింది. అంతకు ముందే జపాన్ సహాయంతో ఏర్పడిన మొదటి ఐఎన్ఎ కొంత నీరసపడి వుంటే దానికి కొత్త ప్రాణం పోశారు. ఇంకా అనేక మంది దేశభక్తులను చేర్చుకున్నారు. ఆగ్నేయాసియాలోని సింగపూర్‌లో స్థావరం ఏర్పాటు చేసుకుని బ్రిటన్‌పై పోరాడేందుకు సన్నాహాలు చేసుకున్నారు. ఈ క్రమంలో 1945 ఆగష్టు18న విమానంలో బయలుదేరిన నేతాజీ పార్మోజా దీవి(ఇప్పటి తైవాన్)లో మరణించారు. జపాన్‌కు చెందిన తనోషీ యోషీమా నాయకత్వంలోని సైనికవైద్య బృందం అన్ని పరీక్షలు జరిపి మరణించినట్టు ప్రకటించింది. ఆయన అంత్యక్రియలు నిర్వహించి చితాభస్మాన్ని భద్రపర్చారు.

అయితే ఆ ప్రమాదంలో ఆయన మరణించలేదనీ, ఉత్తర ప్రదేశ్ దగ్గర సాధూ సర్దానందజీ రూపంలో జీవించి వున్నారని అప్పట్లో ఒక వదంతి బయిలుదేరింది. నేతాజీ సహాయకుడైన ఉత్తమచంద్ మల్హోత్రా ఆయనను గుర్తించాడని చెబుతుంటారు. ఆ సాధువు ఎప్పుడూ బయిటకు వచ్చేవాడుకాదనీ, ఏదో నిగూఢంగా ప్రవర్తించేవాడని ఏవేవో కథనాలు... గాంధీజీ అంత్యక్రియలకు హాజరైనాడని మరో కథనం... ఇదంతా తెలిసి కూడా మొదటి ప్రధాని నెహ్రూ కావాలనే ఈ విషయంలో ఆసక్తి చూపకుండా తొక్కిపడుతున్నాడని ఆరోపణలు. తాను రష్యాలో వున్నాననీ తప్పించుకోవడానికి సహాయపడాలని నేతాజీ రాసిన లేఖకు కూడా నెహ్రూ స్పందించలేదనేంతవరకూ ఈ ఆరోపణలు వెళ్లాయి. దీనిపై నెహ్రూ ప్రభుత్వం 1956లో షా నవాజ్ కమిషన్‌ను నియమించింది. విస్తృతంగా విచారణలు జరిపిన మీదట ఆ కమిషన్ నేతాజీ మరణించాడని నిర్ధారించింది. తర్వాత కూడా ఈ ప్రచారాలు ఆగకపోవడంతో ఇందిరాగాంధీ ప్రభుత్వం 1970లో జస్టిస్ ఖోస్లా కమిషన్‌ను నియమించింది. ఈ కమిషన్‌కూడా అనేక మందిని విచారించి అనేక పర్యటనలు జరిపి నేతాజీ మరణించినట్టు నిర్ధారించింది. 1977లో జనతా ప్రభుత్వం ఏర్పడినప్పుడు పార్లమెంటు సభ్యుడైన సమర్ గుహా నేతాజీ బతికి వున్నట్టు ఒక చిత్రం విడుదల చేశారు. అది ఆయన సోదరుడైన శరత్ చంద్రబోసుదని బెంగాలీ పత్రికలు పోలికలతో సహాప్రకటించాయి. ఆ తర్వాతి కాలంలో నేతాజీ చితాభస్మం తెప్పించి నదుల్లో విలీనం చేశారు. వాజ్‌పేయి నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం 1999లో జస్టిస్ ఎంఎస్ ముఖర్జీ కమిషన్‌ను నియమించినా వారు కూడా తేల్చిందేమీ లేకపోయింది. ముఖర్జీ కమిషన్ నేతాజీ ఆ రోజున విమాన ప్రమాదంలో మరణించలేదని అయితే సరిగ్గా ఏం జరిగిందనేది చెప్పడానికి ఆధారాలు లేవని నివేదించింది. దీని ఆధారంగానే ఆయన మరణించాడనే భావిస్తున్నట్టు ప్రభుత్వం మే 7, 2013 న లోక్‌సభలో ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పింది.

నేతాజీ కుటుంబ సభ్యులు, వారసులు బంధువులలో ఒకరిద్దరు తప్ప మిగిలిన వారంతా ఆయన మరణించాడనే భావిస్తున్నారు. ఆయనతో పనిచేసిన కెప్టెన్ లక్ష్మీ సైగల్ కూడా అదే భావం వెల్లడించారు. నేతాజీ జీవించి వున్నాడని గాని ఆ రోజున మరణించలేదని గాని ఒక్క నిర్దిష్ట సాక్ష్యం గాని వాదన గాని ఇప్పటి వరకూ దొరకలేదు. అయితే ప్రధాని కార్యాలయంలో ఏవో రహస్య ఫైళ్లు వున్నాయని ఒక వాదన. అలాటి రెండు ఫైళ్లు బయటపెట్టామని కూడా ప్రభుత్వాధినేతలు ప్రకటించారు. వాటి ఆధారంగా రాసిన కథనాల్లో నేతాజీ సహాయకుడైన సత్యనారాయణ్ సిన్హాతో మరెవరో ఆయనను చూసినట్టు చెప్పారని మాత్రమే వుంది. సారాంశం చెప్పుకోవాలంటే విమానప్రమాదం తర్వాత సోవియట్ ప్రభుత్వం నేతాజీని సైబీరియాలో ఒక ఖైదులో వుంచిందట. అది కూడా ప్రపంచంలో అతి శీతలమైన యాకుత్సు లో 45వ జైలు గదిలో స్టాలిన్ ఆయనను బంధించాడట. అక్కడ ఆయనను చూసినట్టు కోజ్లోవ్ అనే గూఢచారి తనకు చెప్పాడని డా.సత్యనారాయణ సిన్హా అనే మాజీ ఎంపి ఖోస్లా కమిషన్‌కు చెప్పిన దానికి తగిన విలువ ఇవ్వకుండా దాటేశారట.ఈ సిన్హా ఆ రోజుల్లో ఎలాగో సోవియట్‌లో ప్రవేశించి వారి సైన్యంలో

పనిచేసిన సందర్భంలో ఇదంతా జరిగిందనేది కథనం. ఈ సిన్హా నెహ్రూ తరపున అంతర్జాతీయ బృందాలలో పనిచేసేవాడు. ఆ సందర్భంలోనే బ్రిటిష్ గూఢచారి శాఖ కూడా నేతాజీ మరణంపై సందేహాలు వెలిబుచ్చినట్టు తెలుసుకున్నాడు. జర్మనీ ప్రతినిధి కూడా ఈ విధమైన సందేహమే వ్యక్తం చేశాడని సిన్హా అంటారు. ఈ విషయాలు తాను నెహ్రూకు చెబితే పెద్ద విలువ ఇవ్వలేదనీ అంతా అమెరికా ప్రచారమై వుంటుందని తోసిపారేశాడనీ సిన్హా ఖోస్లా కమిషన్‌కు చెప్పాడు. అంతర్జాతీయంగా వీరంతా నాటి సోవియట్‌కు బద్ధ వ్యతిరేకులేనన్నది తెలిసిందే గనక నెహ్రూ ఆ కోణంలో స్పందించి వుంటాడనుకోవచ్చు. తన దగ్గర ఏవో రహస్య పత్రాలు వున్నాయని ఆయన చూపించబోతే రెండు కమిషన్లు కూడా వాటికి పెద్ద ప్రాధాన్యత నివ్వలేదని ఆయన ఫిర్యాదు చేస్తున్నారు. నిజంగా వాటికి అంత విలువ వుంటే తీసుకునేవారేమో. ఉరిమి ఉరిమి మంగళం మీద పడినట్టు నేతాజీ సంబంధం పెట్టుకున్న జర్మనీ జపాన్ గాక నాటి సోవియట్ యూనియన్‌ను దాని అధినేత స్టాలిన్‌ను ఈ వ్యవహారంలో దోషిగా చూపించే ప్రయత్నమే అనేక సందేహాలు కలిగిస్తుంది. ఆనాడు ప్రపంచంలో తిరుగులేని నాయకుడుగా వున్న స్టాలిన్‌కు నేతాజీ వంటి అనధికార నేత పట్ల అంత ఆసక్తి ప్రదర్శించే అవసరమే వుండదు, అవకాశం అంతకన్నా వుండదు.

వినడానికి ఎంత ఆసక్తి కుతూహలం కలిగించినా నేతాజీ మరణానికి సంబంధించిన ఈ కథనాలను విమర్శనాత్మకంగా చూడకతప్పదు. కొన్ని దశాబ్దాల పర్యంతం డజన్ల మంది నిపుణులు, న్యాయ కోవిదులు దేశదేశాల నేతలు పాలుపంచుకున్న విషయంలో కేవలం ఒక వ్యక్తి తనతో ఎవరో చెప్పారని చెబుతున్న కథనాల ఆధారంగా నేతాజీ గురించిన వూహాగానాలు కొనసాగించడం నిజంగా అవసరమా? అంత మహానాయకుడు బతికే వుంటే అజ్ఞాతంలో ఎందుకుంటారు?

నేతాజీ మనవడు సాగత్ రాయ్ తృణమూల్ ఎంపిగా వున్నారు. నేతాజీ మరణించాడని ఆయన గట్టిగా నమ్మడమే గాక ఈ పునర్విచారణ తతంగాలన్నిటినీ ఖండిస్తున్నారు. ఇది చాలా తక్షణ సమస్య గనక వెంటనే విచారణ చేపట్టాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు ఈ మధ్యనే తోసిపుచ్చిందంటే వాస్తవ పరిస్థితి అర్థమవుతుంది. మోడీ సర్కారు. విడుదల చేసిన రెండు రహస్య ఫైళ్లలోనూ ఒకటి భారత రత్న అవార్డుకోసం సుభాస్‌బోస్‌తో సహా మరో నలుగురి పేర్లను పరిశీలించినప్పటిది. కనుక ఆయన మరణించలేదని చెప్పే కొత్త ఆధారం ఏదీ దొరికింది లేదు. అయితే రేపు పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల ప్రచారంలో లబ్ధి పొందడానికి బిజెపి ఈ అంశాన్ని ఉపయోగించుకుంటుందా అనే సందేహాలు కూడా కొంతమంది వ్యక్తం చేస్తున్నారు. దేశమంతటినీ దిగ్భ్రాంత పర్చిన గాంధీజీ హత్య కేసులో గాడ్సేను సమర్థిస్తున్న వారు ఈ విధంగా నేతాజీ విషయంలో లేనిపోని రభస సృష్టించడం, అటు నెహ్రూపై ఇటు కమ్యూనిస్టులపై కుట్ర ఆరోపణలు చేయడం చూస్తుంటే దీనికి సంఘ పరివార్ భావజాలానికి బంధం వుండొచ్చనే అభిప్రాయం కూడా వుంది.

నేతాజీ జీవించి వున్నాడని గాని ఆ రోజున మరణించలేదని గాని ఒక్క నిర్దిష్ట సాక్ష్యం గాని వాదన గాని ఇప్పటి వరకూ దొరకలేదు. అయితే ప్రధాని కార్యాలయంలో ఏవో రహస్య ఫైళ్లు వున్నాయని ఒక వాదన. అలాటి రెండు ఫైళ్లు బయటపెట్టామని కూడా ప్రభుత్వాధినేతలు ప్రకటించారు.

రాజకీయ ప్రయోజనాలతో పాటు పదే పదే ఈ విచారణ కమిషన్ల నియామకం వల్ల కొందరికి పదవులు నిధులు కూడా లభిస్తుంటాయి. నేతాజీ మరణించాడన్న వాస్తవాన్ని అంగీకరించడం మంచిదని స్వాగత్ రాయ్ గతంలోనే విజ్ఞప్తి చేశారు. అయితే ఇప్పుడు తృణమూల్ కాంగ్రెస్ కూడా తన రాజకీయ ప్రచారం కోసం వైఖరి మార్చుకుంటున్నట్టు కనిపిస్తుంది. తమిళనేత వైగో నేతాజీ ఫైళ్లను బయటపెట్టాలంటూ చేస్తున్న నిరాహారదీక్షకు మద్దతు ప్రకటించడం అందుకు నిదర్శనం. వాస్తవాధారాలు వున్న ఫైళ్లను నిజంగా బయటపెడితే ఇలాటి వ్యర్థ వివాదాలకు ఒక్కసారితో స్వస్తిచెప్పొచ్చు. హిట్లర్‌తో చేతులు కలపడం సరికాదని ఆ రోజుల్లో నేతాజీని విమర్శించినప్పటికీ ఆయన దేశభక్తిపట్ల కమ్యూనిస్టులకు పూర్తి గౌరవం వుంది. వామపక్ష ప్రభుత్వం ప్రతిఏటా ఆయన సంస్మరణ నిర్వహించేది కూడా. ఇప్పుడు ఈ వివాదంపై వారు ఇంకా స్పందించలేదు గాని ఆయనపై వున్న గౌరవాన్ని కట్టుకథలనూ వేరు వేరుగా చూడటం మంచిది.

– తెలకపల్లి రవి

రిటైరయ్యాక ఏం చేస్తున్నారు?

జీవితంలో అరవై ఏళ్లు ఒక మైలురాయి. ఉద్యోగ విరమణ అనంతర బతుకు ప్రయాణం ఒక మలుపు. 58, 60 ఏళ్ళ తర్వాత కూడా హాయిగా జీవించడం సాధ్యం. ఈ క్రమాన ప్రశాంతంగా, నింపాదిగా కొన్ని పనులు చేయడం వీలవుతుంది. క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకునేవారు అరవైల తర్వాత కూడా చురుకుగా ఉంటారు. తమకు తమవాళ్ళకు మాత్రమే కాదు సమాజానికి ఉపకరించే పనులు చేయొచ్చు. ఇతరులకు ఉపయోగపడే కార్యక్రమాలు చేయడం కుదురుతుంది. వివిధరూపాల్లో పదిమందికి సహకరిస్తూ గడపడం బతుక్కి సార్థకత చేకూరుస్తుంది. అప్పుడే మలిసంధ్య ఉపయోగకరంగా ఉంటుంది. అందుకే ఉద్యోగంలోంచి రిటైరయినవారు, అరవై ఏళ్ళు దాటినవారు ఇప్పుడు ఏం చేస్తున్నారు? సమాజానికి ఉపకరించే పనులు ఏమైనా చేస్తున్నారా? ఇతరులకు ఏదో రూపంలో తోడ్పడే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారా? మీ వ్యాపకం, కాలక్షేపం ఇతరులకు తోడ్పడేట్టు వుంటే 'మలిసంధ్య' శీర్షికకు రాయండి. అరవైల తర్వాత జీవితం ఎలా గడుపుతున్నారో రాసి, మీ ఫొటోతో సహా పంపించండి. 'మలిసంధ్య' శీర్షికలో ప్రచురిస్తాం.

చిరునామా: మలిసంధ్య, సోపతి, ఎడిటర్, ప్రజాశక్తి దినపత్రిక, ఎమ్.హెచ్.భవన్, అజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-20

నెమలీక



పంచవన్నెల చిలకలు

- మన చుట్టూ 372 రకాల చిలుకలు ఉన్నాయి.
- చిలుకలు ఎక్కువగా ఉష్ణమండలాల్లో నివసిస్తాయి.
- వీటి ముక్కు చివర వంగి వుంటుంది. కాళ్లు బలంగా ఉంటాయి.
- ఆకర్షణీయం చిలక పచ్చ రంగులో వుంటాయి. కొన్ని పంచ రంగుల్లో కూడా ఉంటాయి.
- తెలివైన పక్షుల జాబితాలో చిలుకలు ముందుంటాయి.
- కొన్ని రకాల చిలుక జాతులు మనుషుల మాటల్ని అనుకరిస్తాయి.
- కొన్ని రకాల చిలుకలు కేవలం గింజల్ని మాత్రమే ఆహారంగా తీసుకుంటే, మరికొన్ని పండ్లను, ఇంకొన్ని చిన్న కీటకాలను తింటాయి.
- కొన్ని చిలుకల జీవిత కాలం 80 సంవత్సరాలు కూడా ఉంది.



తల ఏది?

ఐదు జిరాఫీల మెడలన్నీ ఒకదానితో మరొకటి చిక్కుబడిపోయాయి. ఏ జిరాఫీ తల ఏదో గుర్తించండి.

ఏం రాష్ట్రం వారు?

ఇక్కడ నాలుగు రాష్ట్రాల వారు సంప్రదాయ దుస్తుల్లో వున్నారు. వారు ఏయే రాష్ట్రాలకు చెందిన వారో చెప్పగలరేమో ప్రయత్నించండి?

కవలలేరి!

ఇక్కడున్న వాళ్ళలో ఒక కవల జంట వుంది. వాళ్ళు ఎవరో గుర్తుపట్టారా?

కీటకాలతో అక్షరాలు

ఆశ్చర్యపోతున్నారా? ఇవన్నీ కీటకాల బొమ్మలతో చేసిన ఆంగ్ల అక్షరాలు. పుల్లలు, ఆకులు.. గింజలు... ఇలా వేటితోనైనా అక్షరాలు చేయడానికి ప్రయత్నించొచ్చు. ఇలా చెప్తే నేర్చుకోడానికి చిన్నారులు ఆసక్తి చూపిస్తారు.

భౌతిక శాస్త్రంలో మొదటి నోబెల్ ప్రైజ్ విజేత



భారతదేశంలో భౌతిక శాస్త్రంలో మొట్టమొదటి నోబెల్ ప్రైజ్ విజేత, విశ్వవిఖ్యాత భౌతిక శాస్త్రవేత్త సర్ సి.వి.రామన్.

రామన్‌కు 1930లో నోబెల్ బహుమతి లభించింది. రామన్ ఎఫెక్ట్ అనే పరిశోధన ఈ బహుమతి వీరిని వరించేలా చేసింది. ఈ పరిశోధన ఫలితాన్ని ధృవపరిచిన ఫిబ్రవరి 28వ తేదీని జాతీయ సైన్స్ దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించింది.

రామన్ ఎఫెక్ట్ అంటే కాంతి కిరణం. ఒక పారదర్శక పదార్థం గుండా ప్రయాణించినప్పుడు, దానిలో కలిగే మార్పులు వివరిస్తుంది.

దీనిద్వారా 2000 రసాయన మిశ్రమాల నిర్మాణాలను కనుగొనగలిగారు. చివరకు లేజర్ కిరణాల ఆవిష్కరణ తరువాత ఈ రామన్ ఎఫెక్ట్ ప్రాముఖ్యత, అవసరం మరింత పెరిగింది.

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ బెంగళూరు నందు డైరెక్టర్ పదవిలో దాదాపు పది సంవత్సరాలు పనిచేశారు. ఈ దశలో ఎందరికో ప్రోత్సాహం కలిగించారు. దేశవిదేశాల్లో వీరికి ఎన్నో పురస్కారాలు లభించాయి. భారత ప్రభుత్వం వీరిని భారతరత్న తో సత్కరించింది.

విదూషకుని తెలివి

సింహపురి రాజుకు పొగడ్తలంటే చాలా ఇష్టం. ఆ పొగడ్తలకు లొంగి, అడిగినవారికి లేదనకుండా విలువైన బహుమతులు ఇచ్చేవాడు. ఇది ఆస్థాన విదూహకునికి ఏ మాత్రం నచ్చేది కాదు.

అందరూ తనని పొగుడుతుంటే విదూషకుడు మాత్రం ఎందుకు పొగడడం లేదని రాజుగారికి కోపంగా వుండేది. ఎలాగైనా విదూషకుడితో పొగిడించు కోవాలనుకున్నాడు. ఒకరోజు 'నేను చాలా అందంగా వుంటాను కదా. నా అందం ఇంద్రుడితో సమానమా, చంద్రుడితో సమానమా?' అని అడిగాడు.

మీరు ఇంద్రుడూ కాదు, చంద్రుడూ కాదు. మీరు సింహపురి మహారాజు' అన్నాడు విదూషకుడు.

ఆ మాటకి రాజుగారిక కోపం వచ్చింది. 'నేను వాళ్ళంత అందంగా లేనని అవమానిస్తున్నావు. చూడు నీకు ఏ శిక్ష విధిస్తానో' అని విదూషకుడితో అన్నాడు.

'ప్రభూ! నన్ను అపార్థం చేసుకోకండి. ఆ ఇంద్రుడు పిరికివాడు. రాక్షసులు అడ్డుపడినప్పుడు, భయపడి పారిపోయాడు. చంద్రుడి మీద మచ్చలున్న విషయం లోక విదితమే. అందుకే మీకు వారితో పోలికేంటి? మీరు మీరే. వీరులు, అందగాళ్ళు. అందుకే మిమ్మల్ని వారితో పోల్చకుండా మీరు సింహపురి మహారాజు అన్నాను' అని మహారాజుకు వివరించాడు.

ఈ మాటలతో రాజు సంతోషించి వెంటనే తన మెడలోని ముత్యాల హారాన్ని తీసి విదూషకుడికి ఇచ్చాడు మహారాజు.

■ సీరియల్

ప్రేమ - విప్లవం

మూలం : మేరీ గాబ్రియేల్

స్వేచ్ఛానువాదం: **ముక్తవరం పార్థసారథి**, ఫోన్: 91776 18708

(గతవారం తరువాయి)

ప్రారంభించబోయే పత్రిక న్యూ రైనిష్ జైటుంగ్ కోసం ఆధిపత్య పోరు కొనసాగింది. తను కూడా కొంత పెట్టుబడి పెట్టి, పత్రికను హెస్ నుండి తన అధీనంలోకి తీసుకున్నాడు మార్క్స్. ఆ తర్వాత కమ్యూనిస్టు లీగ్ సభ్యుల్ని సిబ్బందిగా నియమించుకున్నాడు. ఇప్పుడు ఆ పత్రికకు సంపాదకుడు కూడా తనే.

కొలోన్‌లోని ఒక ఖరీదైన ప్రాంతంలో అపార్ట్‌మెంట్ అద్దెకు తీసుకున్నారు మార్క్స్ దంపతులు. అక్కడ రాజప్రాసాదాలు లేవు గాని రాజప్రాసాదాల్లాంటి ధనవంతుల బంగళాలున్నాయి. అయితే, అక్కడ ఉండటం ఎంత వరకూ క్షేమం? ఎనిమిది వేల మంది వున్న ప్రష్యన్ మిలిటరీ క్యాంప్ పక్కనే ఉంటుంది అపార్ట్‌మెంట్. రోజంతా ఆయుధాలు తరలిస్తున్న శబ్దం వినిపిస్తూనే ఉంటుంది. సైన్యం కదలికలు చూస్తుంటే ఎవరిమీదో యుద్ధానికి సిద్ధమవుతున్నట్టుగా తెలిసింది. ఈ సైనిక దాడిని తట్టుకోవటానికి పత్రికా సిబ్బంది ఎనిమిది రైఫిళ్లు, 250 తూటాలు పెట్టుకుని ఆత్మరక్షణకు ప్రయత్నించారు! మార్క్స్ దగ్గర కూడా ఒక తుపాకీ ఉంది.

మొత్తం మీద జూన్ 1, 1848 ఆ ఉద్రిక్త పరిస్థితుల్లో 'న్యూ రైనిష్ జైటుంగ్' ప్రారంభమైంది. పబ్లిషర్లు దీన్ని 'ప్రజాస్వామ్యంలో భాగస్వామి' అన్నారు. యూరప్‌లో జరుగుతున్న ప్రజాస్వామ్య పోరాటాలను, సంఘర్షణలను యథాతథంగా రిపోర్టు చేయడం ఈ పత్రిక ప్రత్యేకత. పాఠకులను చైతన్య పరచటం 'పత్రికల ముఖ్య బాధ్యత' అని నమ్మాడు మార్క్స్. ఇతర దేశాలలో, ఇతర ప్రాంతాలలో జరుగుతున్న పోరాటాల గురించి తెలుసుకుంటే తప్ప వాళ్లు ఉద్యమానికి సంసిద్ధులు కాలేరు. కాని అప్పటికి ఇతర దేశాల నుండి వస్తున్న వార్తలు అంత ఉత్తేజకరంగా లేవు. ఉద్యమ తీవ్రత తగ్గింది. పోరాట యోధులు పురోగమించడం లేదు సరికదా తిరోగమిస్తున్నారు.

ఫిబ్రవరి–జూన్ నెలల మధ్య తొలిరోజుల విప్లవోత్సాహం తగ్గింది. వర్గాల మధ్య పెరిగిన పరస్పర అపనమ్మకంతో వైషమ్యాలు పెరిగాయి. మధ్యతరగతి వాళ్లు ఇది తమ విజయమనే అనుకున్నారు కాని, విప్లవంలో అనేక త్యాగాలు చేసిన కార్మికవర్గానికి లాభం చేకూరకపోతే పరిస్థితి తారుమారవుతుందని వాళ్లకు తెలుసు. మధ్యతరగతి ప్రయోజనాలు నెరవేరి, ఓటింగ్ హక్కులు కూడా సాధించుకున్న తర్వాత తమ ప్రత్యేక హోదా తగ్గిందని కినుక వహించారు ఉన్నత వర్గాల వాళ్లు. ఆకలిగొన్నవాళ్ల అవసరాలు తీర్చటం కోసం, మధ్యతరగతి వాళ్లు తమ మీద పన్నుల భారం మోపుతారని భయపడ్డారు రైతులు. 'ప్రభుత్వాన్ని పడగొట్టడం సులభం. కొత్త వ్యవస్థను నెలకొల్పడం కష్టం' అని అనుభవం మీద తెలిసింది అది కష్టం కాదు. అసాధ్యం!

ఫ్రాన్సులో తాత్కాలిక ప్రభుత్వ అధ్యక్ష పదవి ఒక ఎనభై ఏళ్ల మేధావి, రచయిత, కవి, విప్లవ యోధుడు అల్ఫాన్స్ మారీలూయీడి లామార్టైన్‌ను అలంకరించింది. ఈయన గొప్ప వక్త. మాటల తూటాలతో ప్రత్యర్థులను తుడిచి పెట్టగలడు. అయితే ప్రభుత్వంలో ఈయన సహచరులందరూ కొత్తవాళ్లు. పరిపాలనా అనుభవం లేదు. పైగా, ప్రభుత్వం ఎలా వుండాలి, ఏం చెయ్యాలి అన్న విషయాలపై ఎవరి అభిప్రాయాలు వాళ్లకున్నాయి.

ప్రభుత్వంలో ఇంత గందరగోళం నెలకొన్నప్పటికీ, వాళ్లు సాధించిన విజయాలు తక్కువేమీ కాదు. వలస దేశాలలో బానిస విధానం రద్దు, పురుషులందరికీ ఓటింగ్ హక్కు, సమావేశాలు పెట్టుకోవటానికీ, పత్రికలకూ స్వేచ్ఛ, ఉద్యోగాల కల్పన కోసం చర్యలు, పని గంటల తగ్గింపు, రాజకీయ నేరాలకు మరణశిక్ష రద్దు వంటివి వాళ్లు చేసిన సంస్కరణల్లో కొన్ని మాత్రమే. అయినప్పటికీ, సమాజంలో ఉద్రిక్తత, అసంతృప్తి తగ్గలేదు. గ్రామీణ ప్రాంతాల్లో, రాజధానిలో తీసుకుంటున్న నిర్ణయాల పట్ల నమ్మకం లేదు. 1827లో అప్పటి ప్రభుత్వం తీసుకున్న రైతు వ్యతిరేక నిర్ణయాలను ఇంకా ఉపసంహరించలేదు. అడవుల్లో పడి ఉన్న కలప ఏరుకోవటం ఇంకా నిషిద్ధమే. దీనికి తోడు భూమి మీద 45 శాతం అదనపు పన్ను విధించడంతో రైతుల కోపం కట్టలు తెంచుకుంది. రాబోయే ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థుల తరపున ప్రచారం చెయ్యటానికి పారిస్ నుండి ప్రభుత్వ సమర్థకులు కొందరు రావడంతో, ఇక రాజకీయంగా కూడా తమను అణచివేయాలనుకుంటున్నారని రగిలిపోయారు రైతులు. నిజానికప్పటికి తొంభై లక్షల మందితో ఎన్నికల ప్రక్రియ నిర్వహించటానికి అవసరమైన సామర్థ్యం ప్రభుత్వానికి లేదు.

ఎన్నికల రోజున జనం భారీగా తరలి వచ్చారు. 84 శాతం మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఆ తర్వాత ఫలితాలు ప్రకటించినప్పుడు, ఎన్నికైన 876 మందిలో రాడికల్స్/సోషలిస్టులు వందకన్నా తక్కువ మంది, అత్యధికులు కన్సర్వేటివ్‌లు లేదా మాడరేట్‌లు – వీళ్లలో ఎక్కువ మంది లూయీ ఫిలిప్ పాలనలో అధికారంలో ఉన్న వాళ్లే. ఓట్లేసిన పారిస్ పౌరులు, తమకు ఎన్నికల్లో ప్రాతినిధ్యం లభించలేదనుకున్నారు. తాము ఓడించామనుకున్న ధనిక వర్గమే తిరిగి అధికారం చేజిక్కించుకుంది.

"కూలీ దొరక్క లక్ష మంది కార్మికులు ఆకలితో అలమటిస్తున్నారు. వాళ్ల బుర్రల నిండా పనికిరాని సిద్ధాంతాలు. సమాజం నిలువునా చీలిపోయింది. ఒకవైపు ఏమీ లేని పేదలు – అవకాశం దొరికితే దోచుకుందామని నిరీక్షిస్తున్నారు. మరోవైపు కొద్దోగొప్పో ఉన్నవాళ్లు – ఈ పేదలు తమ మీద ఎప్పుడు దాడి చేస్తారోననే భయంతో బతుకుతున్నారు. ఇదీ రాజధానిలో నాకు కనిపించిన దృశ్యం" అన్నాడు తుకెవిల్. ఇతను ఒక ప్రాంతీయ నియోజక వర్గం నుండి పార్లమెంటుకు ఎన్నికైన సభ్యుడు.

మే 15 నాడు, అసంతృప్తితో రగిలిపోతున్న కార్మికులు, అతివాదుల నాయకత్వంలో నేషనల్ అసెంబ్లీ (పార్లమెంట్) మీద దాడి చేసి, లోపల వున్న వాళ్లందర్నీ భయభ్రాంతుల్ని చేశారు. ఆ తర్వాత సభాధ్యక్షుని కుర్చీ మీద ఎర్రటి టోపీ పెట్టి "కొత్త" తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు చేశారు. అయితే వీళ్ళ 'పాలన' కొన్ని గంటలు మాత్రమే కొనసాగింది.

ఫ్రెంచి ప్రభుత్వం తొలి ప్రమాదం నుండి గట్టెక్కింది. ఇప్పుడివన్నీ కేవలం నాటకీయ పరిణామాలుగా కనిపించినా, కొత్తగా ఏర్పడుతున్న సామాజిక వ్యవస్థకు అతివాదుల నుండి వున్న బెడదను స్పష్టం చేస్తున్నాయి. మధ్యతరగతి వాళ్లు, ధనిక వర్గం కన్నా కార్మిక వర్గమే ఎక్కువ ప్రమాదకరమనుకున్నారు.

ప్రష్యాలో కూడా పరిస్థితి ఇలాగే ఉంది. మార్చి 18 తర్వాత, ఫ్రీడ్రిక్ విల్హెమ్ రాజు తన మంత్రివర్గంలో ఉదారవాదులను ఎక్కువ మందిని తీసుకున్నాడు. ఒకప్పుడు రైనిష్ జైటుంగ్‌కు వెన్నుదన్నుగా వున్న మార్క్స్ మిత్రుడు లుడాల్ఫ్

కాంప్‌హాసెన్ ఇప్పుడు ప్రధానమంత్రి, మరో మిత్రుడు డేవిడ్ హాన్సేమాన్ ఆర్థికమంత్రి. "ప్రష్యాలో వస్తున్న మార్పులకనుగుణంగా కొత్త ప్రజాప్రతినిధులు ఎన్నుకోవటానికి సన్నాహాలు ప్రారంభమయ్యాయి. జర్మన్ సమాఖ్య స్థానంలో, కొత్త జర్మనీని ఏర్పాటు చెయ్యాలని సంకల్పించారు. అందుకోసం సమాఖ్య అంతటా ఎన్నికలు నిర్వహించాలి. కాని ఫ్రాన్సులో లాగానే, జర్మన్ పౌరులకు కూడా ఎన్నికల ప్రక్రియ ఇంకా కొత్తే. ఓటర్లను తమ వైపుకు తిప్పుకోవటానికి వివిధ గ్రూపులు తీవ్రంగా కృషి చేశాయి. కన్సర్వేటివ్‌లకు పాత వ్యవస్థ కావాలి. మధ్యేవాదులకు ప్రగతి కావాలి కాని అలజడి వద్దు. డెమోక్రాట్లకు మార్చి విప్లవ ఫలితాల ప్రయోజనాలు కావాలి. గాట్‌బాక్ లాంటి వాళ్లు ఎన్నికలను బహిష్కరించవలసిందిగా ప్రచారం చేశారు. రైతులు, కార్మికులూ ఎన్నికలకు ముందే తమ ప్రయోజనాలు నెరవేరాలన్నారు. వాళ్లవి తక్షణ అవసరాలు.

మార్చి నెలలో వృత్తి పనివాళ్లు, పనిభద్రత, తగిన ప్రతిఫలం కావాలని తిరుగుబాట్లు చేశారు. ఈ ఫ్యాక్టరీ వ్యవస్థ వల్ల వృత్తులు నాశనమవుతున్నాయి. తాము పని కోల్పోతున్నాము. మళ్లీ పాత రోజులు వస్తే తప్ప తాము మనుగడ కొనసాగించలేము. సిలేషియన్ నేత కార్మికుల్లాగే వీళ్లు కూడా సంపన్నుల ఇళ్ల మీదా, ఫ్యాక్టరీల మీదా దాడి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతుల తిరుగుబాట్లు కొనసాగాయి. చిన్న కమతాలను కొనుక్కుని తమ పొలాల్లో కలుపుకున్న భూస్వాములకు వ్యతిరేకంగా జరిగిందీ పోరాటం. భూములను కోల్పోయిన రైతులే దీనికి నాయకులు.

అంతా సవ్యంగా ఉందనుకున్నప్పుడు కూడా రాజకీయ సంస్కరణలు చేపట్టడం కష్టసాధ్యమైన విషయమే. ఆర్థిక సంక్షోభం సృష్టించిన సామాజిక సుడిగుండంలో అవి అసాధ్యం. ఉదారవాద బూర్జువాలు ఈ కొత్త పరిస్థితిని బాగానే అంచనా వేశారు. "విప్లవం ప్రమాదకరమైంది. ఆర్థిక డిమాండ్లు నెరవేర్చుకోవటానికి విప్లవం అవసరం లేదు". అంటే వాళ్లు విప్లవకారుల రాజకీయ డిమాండ్లను అంగీకరించరు గాని ఆర్థిక డిమాండ్లకు అడ్డుపడరు.

కొత్త ప్రభుత్వంలో ఆర్థిక పరిస్థితి కొంత కుదుట పడింది. పరపతి విధానం సరళీకరించడంతో అవసరానికి అప్పు సులభంగా దొరికి వ్యాపారస్తులు బాగు పడ్డారు. (చివరికి, రాజుగారు ప్రారంభించాలనుకున్న రైల్వే పరిశ్రమకు కూడా అప్పు దొరికింది). వ్యాపారస్తులను శాంతింపచేసి త్వరలోనే వృత్తిపనివాళ్లనూ, రైతులనూ ఆదుకుంటామన్నది ప్రభుత్వం. కాని వీళ్లక్కావలసింది వాగ్దానాలు కావు. కేవలం మాటలతో మభ్యపెట్టాలనుకుంటే కొత్త ప్రభుత్వానికీ, పాతదానికీ తేడా ఏమిటి?

ఎన్నికల ప్రకటనల్లోని అస్పష్టతతో అసలే ఉద్రిక్తంగా ఉన్న పరిస్థితి మరింత దిగజారింది. ఎన్నికల చట్టంలో "చట్టబద్ధమైన వయోపరిమితికి లోబడి అందరూ ఓటెయ్యటానికి అర్హులే" అన్నారు. కాని వాళ్లకు ఓటేసే హక్కుందని స్పష్టం చెయ్యలేదు. జీతాల మీద ఆధారపడ్డ వ్యక్తుల్ని వాళ్లు 'స్వతంత్ర జీవితం' గడపటం లేదనే నెపంతో ఓట్లు వెయ్యనివ్వలేదు. సంచార వృత్తుల వాళ్లనూ, వలస కూలీలనూ నగరాల్లో ఓటింగ్‌కు అనుమతించలేదు. ఒక ప్రాంతంలోనైతే బ్రహ్మచారులకు, యూదులకు కూడా ఈ హక్కు నిరాకరించారు. ఓట్లు లెక్కపెట్టేసరికి అర్హులైన ఓటర్లలో సగం మంది మాత్రమే తమ హక్కు వినియోగించుకున్నారని తెలిసింది. కొన్ని చోట్ల ఇది 30 శాతానికి మించలేదు. ఓట్లు వెయ్యని వాళ్లలో ఎక్కువ మంది కార్మికులూ, ఇతర నిమ్న వర్గాల వాళ్లూ. సహజంగానే వీళ్లకు విజేతలు అధికారవర్గ తొత్తుల్లాగ కనిపించారు. కొత్తగా ఎన్నికైన జర్మన్, ప్రష్యన్ ప్రతినిధుల సభలు నిరుపయోగమైనవి. ఎన్నికైన వాళ్లంతా అసమర్థులు అని ప్రకటించింది న్యూ రైనిష్ జైటుంగ్.

ఫ్రాంక్‌ఫర్ట్‌లో జరిగిన జర్మన్ నేషనల్ అసెంబ్లీ సమావేశాలు అందర్నీ నిరుత్సాహ పరిచాయి. ఈ అసెంబ్లీకి ఇదే తొలి సమావేశం. దాని అధికారాలేమిటో స్పష్టంగా తెలియవు. జర్మనీలోని అత్యున్నతమైన ప్రతినిధుల సభ ఇదే. కాని అప్పటికి ఇంకా 'జర్మనీ' ఆవిర్భవించలేదు. అందువల్ల దీనికి చట్టాలను చేసే అధికారం ఉందో లేదో తెలియదు. "ఇది ఒక ఊహాజనిత దేశ చట్టసభ. ఊహాజనితమైన విషయాలు చర్చించింది. ఊహాజనిత ప్రభుత్వం తనకు తాను ఉనికిని కల్పించుకునే ప్రయత్నం చేసింది. ఎవరూ ఖాతరు చెయ్యని ఊహాజనిత ప్రతిపాదనలను ఆమోదించింది" అన్నాడు ఎంగెల్స్.

సిబ్బంది కొరతతో, ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న న్యూ రైనిష్ జైటుంగ్ ప్రచారం మీద కేంద్రీకరించింది. రంగురంగుల ప్లకార్డులు కొలోన్ వీధుల్ని అలంకరించాయి. బీరు, వైను షాపుల్లో, చందాదారుల జాబితా ప్రదర్శించారు. అయితే, వీటి కన్నా, ఆ పత్రికలోని వార్తాకథనాలు పాఠకుల్ని ఎక్కువ ఆకట్టుకున్నాయి. ఇన్నాళ్లూ పత్రికలపై ఆంక్షలతో విసిగిపోయిన వాళ్లు ఇప్పుడు బాహాటంగా, ధైర్యంగా ప్రచురిస్తున్న రిపోర్టులలోని నమ్మలేని నిజాలకు అవాక్కయ్యారు. యూరప్‌లోని విలేకర్ల కథనాలు, ఇతర విదేశీ విలేకర్ల కథనాలూ పరస్పర మార్పిడి అవగాహనతో ప్రచురించటంతో అత్యధిక విదేశీ సమాచారం ప్రచురించే పత్రికగా న్యూ రైనిష్ జైటుంగ్‌కు పేరొచ్చింది. మార్క్స్ సంపాదకత్వంలో ఆ పత్రిక సాధించిన ఘనత అది. సర్క్యులేషన్ అయిదువేల మంది చందాదారులకు పెరిగింది. (అరువు తీసుకుని చదివేవాళ్లను కూడా కలిపి సంఖ్య అనేక రెట్లుంటుంది) ముప్పైతొమ్మిది జర్మన్ రాష్ట్రాలలో అత్యధిక పాఠకులున్న పత్రిక ఇదే. దీని ఖ్యాతి లేదా పాపులారిటీ ఎంతోమందిని ఆకర్షించింది. అమెరికాలో కూడా దీని అభిమానులు పెరిగారు.

ఈ పత్రిక ఎలా నడుస్తుందో చూడాలని అందరి కోరిక. 'సంపాదకుడు ఒక నియంత' అంటాడు ఎంగెల్స్. న్యూయార్క్ డైలీ ట్రిబ్యూన్ (పత్రిక) తరపున రైన్‌లాండ్ వచ్చిన అమెరికన్ సోషలిస్టు ఆల్బర్ట్ బ్రిస్బేన్ మార్క్స్ 'సాదాసీదాగా ఉంటాడు. మితభాషి'. 'ఆయన ధైర్యం, నిబద్ధత గొప్పది' అన్నాడు. తర్వాతి రోజుల్లో యు.ఎస్ అంతరంగిక విషయాల సెక్రటరీగా పని చేసిన కార్ల్ షుర్జ్, మార్చి 18 నాటి తిరుగుబాటు కాలంలో బెర్లిన్‌లో ఉన్నాడు. అప్పటికి అతడి వయసు పంతొమ్మిదేళ్లు. తిరుగుబాట్లు ఎలా ఉంటాయో ప్రత్యక్షంగా చూడటం అదే మొదటిసారి. కొలోన్ వెళ్లి, మార్క్స్ ఉపన్యసిస్తుండగా విని "అప్పటికి ఆయన వయస్సు ముప్పైకి మించదు. కాని అప్పటికే ఆయన సోషలిస్టులందరికీ నాయకుడు. కాస్త బలిష్టంగా ఉంటాడు. విశాలమైన నుదురు. అతని నల్లని జుత్తు, గడ్డం, మెరిసే కళ్లు ఎవర్నైనా ఇట్టే ఆకర్షిస్తాయి" అంటూ రాశాడు. కాని ఆయన ఉపన్యాసం భరించలేకపోయాను. తనతో విభేదించిన వాళ్ల పట్ల ఆయన ప్రవర్తన దారుణంగా ఉండేది. నచ్చని వాదనను ఆయన కేవలం తిరస్కరించడు. గాయపరిచే వ్యంగ్యంతో ఎద్దేవా చేస్తాడు. అంతులేని అజ్ఞానంతో మాత్రమే ఎదుటి మనిషి తనతో విభేదిస్తున్నాడంటాడు. అసలు అలా విభేదించటం వెనుక ఉన్న వ్యక్తి ఉద్దేశాన్ని కూడా ప్రశ్నిస్తున్నాడు. షుర్జ్ ప్రకారం "మార్క్స్ ప్రవర్తన ఇంత ఆక్షేపణీయంగా ఉండకపోతే, ఆయన అనుయాయులు మరెన్నో రెట్లు పెరిగేవారు".

కాని మార్క్స్‌కు అత్యంత సన్నిహితులు జెన్నీ, ఎంగెల్స్ మాత్రం "తాను సత్యమని నమ్మిందే ఆయన వాదించాడు. ఇంత ముఖ్యమైన విషయం ఇతర్లు ఎందుకు గ్రహించటం లేదనే ఆయన కోపం" అన్నారు. రాజకీయ సంబంధమైన విషయాల్లో ఆయనకు ఆత్మ సంశయం ఏమాత్రం ఉండేది కాదు. ఆయన ఆత్మవిశ్వాసాన్ని కొందరు అహంకారమనుకున్నారు. అయితే, ఈ ప్రవర్తనతో అతను ఎంతో నష్టపోయాడనటంలో సందేహం లేదు. మౌలికంగా అతను జర్నలిస్ట్, తాత్వికుడు, ఆర్థిక శాస్త్రవేత్త. వీటి ద్వారా అతడు రాజకీయ సమస్యలకు పరిష్కారాలు వెదికాడు కాని ఆయన పొలిటీషియన్ కాడు. తననందరూ ప్రేమించాలని, ఇష్టపడాలనీ ఎప్పుడూ కోరుకోలేదు. తనను ఇష్టపడ్డ వాళ్లపట్ల ఆయన అభిమానానికి అవధులుండవు. తన వల్ల ఎవరైనా గాయపడతారేమోననే విషయం ఆయనెప్పుడూ ఆలోచించలేదు.

కొలోన్‌లో, క్రమంగా ఆయన శత్రువులు కూడా పెరిగారు. ఈ శత్రువుల్లో కొందరు పత్రికకు పెట్టుబడి పెట్టిన వాళ్లు. వాళ్లకు కోపమొస్తే పత్రిక బతకటం కష్టం. జూన్ 5 నాటి పత్రికలో "మార్చి 18 తిరుగుబాటు"ను కేవలం ఒక 'అల్లరిమూకల పని'గా గుర్తించాలని ప్రైమినిస్టర్‌కు సూచించాడు మార్క్స్. ఇది చూసి మార్క్స్ అతివాదం వైపు మొగ్గు చూపుతున్నాడనుకున్నారు పత్రిక స్టాక్ హోల్డర్లు. అంటే ఆయన చర్యల్ని వాళ్లు సమర్థించరు. అయితే ఈసారి కథ మలుపు తిరిగింది, స్థానిక సంక్షోభం వల్ల కాదు. పారిస్‌లో రక్తపుటేరులు పారించిన యుద్ధం దానికి కారణం.

(సశేషం)

■ మలిసంధ్య

నలుగురికీ ఉపయోగపడేలా...

నేను 1998 జూన్ 30న డివిజనల్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్) ఆపరేషన్, జనగామ వారి కార్యాలయం నుండి పదవీ విరమణ చేశాను. స్వతహాగా నాకున్న సాహిత్యాభిలాష పుస్తక పఠనం వైపు లాగింది. రోజూ సాయంత్రం జనగామ రైల్వే స్టేషన్లో కాసేపు సమయాన్ని గడిపేవాణ్ణి.

2005లో నాతో పాటు కొంతమంది విద్యుత్ విశ్రాంత ఉద్యోగులు కలిసి పవర్ పెన్షనర్స్ వెల్ఫేర్ సొసైటీ (పొదుపు సంఘం) ఏర్పాటు చేసుకుని, దాని ద్వారా సభ్యుల పరస్పర ఆర్థిక అవసరాలను తీర్చుకుంటున్నాం. నేను పొదుపు సంఘానికి క్యాషియర్‌గా ఇప్పటికీ కొనసాగుతున్నాను.

2007లో వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఎన్.పి.డి.సి.ఎల్ - పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేసుకున్నాం. ప్రతి నెలా ఆరవ తేదీన హన్మకొండ పబ్లిక్ గార్డెన్‌లో సమావేశమై డివిజన్ల వారీగా పెన్షనర్ల సమస్యలు తెలుసుకుని పరిష్కారాల గురించి ఆలోచిస్తాం. అనేక సమస్యలను పరిష్కరించాం కూడా. వాటి వివరాలు పెద్ద లిస్టే అవుతుంది. ప్రస్తుతం మా అసోసియేషన్ సభ్యుల సంఖ్య 800 పైనే.

2007 సెప్టెంబర్ 15 నాటి ప్రథమ సమావేశంలో నన్ను ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎన్నుకున్నారు. జనగామ డివిజన్ పరిధిలోని పెన్షనర్ల అవసరాలను తీర్చడం నా విధి. వైద్య పరమైన క్రెడిట్ కార్డు ఇప్పించడం, మెడికల్ రియంబర్స్‌మెంట్ బిల్లుల ఆరా తీయడం, 15 సంవత్సరాలు పూర్తి చేసిన పెన్షనర్లకు కమ్యూటేషన్ కలిపిన రివైజ్డ్ పెన్షన్ ఇప్పించడం, డి.ఎ. పెరిగినప్పుడల్లా పెన్షనర్లకు ఎంత మేర లబ్ది చేకూరిందనే విషయాన్ని తెలియజేస్తుంటాను. ఐ.టి. విషయంలోనూ సహాయం చేస్తుంటాను. నా డివిజన్ పరిధిలో దాదాపుగా 60 మందిని సభ్యులుగా చేర్పించాను. ప్రతి పెన్షనర్ 620 రూపాయలు చెల్లించి సభ్యత్వం తీసుకోవాలి. ఇందులో 50 రూపాయలు అడ్మిషన్ ఫీజుగా, 120 రూపాయలు వార్షిక రుసుం, 250 రూపాయలు డొనేషన్, మరో 200 రూపాయలు వెల్ఫేర్ ఫండ్‌గా పరిగణిస్తాం. వెల్ఫేర్ ఫండ్ ఉద్దేశ్యమేమిటంటే ఏ సభ్యుడైనా మరణిస్తే ముందుగా సంబంధిత అధికారికి తెలిపి, ఫ్యూనల్ ఛార్జెస్ ఇప్పిస్తాం. ఆ తర్వాత సదరు పెన్షనర్ ఇంటికి వెళ్లి అతనికి పూలమాల వేసి కుటుంబ సభ్యులను ఓదార్చి అసోసియేషన్ తరపున వెయ్యి రూపాయలు అందజేసి, ఆ తర్వాత ఆ దివంగత పెన్షనర్ భార్యకు ఫ్యామిలీ పెన్షన్ ఇప్పించడంలో సహాయపడుతుంటాం. ఈ ఆనవాయితి జనగామ డివిజన్ పరిధిలో నా ఆధ్వర్యంలో కొనసాగుతోంది.

ప్రతి సంవత్సరం డిసెంబర్ 17 పెన్షనర్స్‌డే సర్వ సభ్య సమావేశంలో 75 సంవత్సరాల వయసు పూర్తి చేసుకున్న సభ్యులకు సన్మానం చేస్తాం. ఆ తర్వాత కార్యదర్శి నివేదిక వుంటుంది. ప్రతి రూపాయికి లెక్క చెప్తాం. దీనికో ఆడిట్ విభాగాన్ని కూడా ఏర్పాటు చేశాం. హ్యాండ్ బుక్ కమిటీ వుంది. అందులో ముఖ్యమైన పెన్షన్ రూల్సు, సభుయల పేర్లు, వారి ఫోన్ నెంబర్లు వుంటాయి. వార్షిక రుసుము 120 రూపాయలు చెల్లించిన ప్రతి సభ్యునికి ఈ హ్యాండ్ బుక్ ఇవ్వబడుతుంది. ప్రస్తుతం నేను ఈ అసోసియేషన్‌కు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంటుగా సేవలు అందిస్తున్నాను.

- డి.రాజశేఖరం, జనగామ, వరంగల్, 9399938818

స్ఫూర్తినిచ్చిన గురువు ■

వారే నా ఎదుగుదలకు తోడ్పడ్డారు

నేను మెదక్ జిల్లా తొగుట జిల్లా పరిషత్ స్కూల్లో ఇంగ్లీష్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాను. జీవితంలో అవరోధాలన్నీ స్ఫూర్తిపాఠాలవుతున్నాయి. షేక్‌స్పియర్, వివేకానందుని రచనలు, మదర్ థెరిసా సేవాభావం, మహాత్మాగాంధీ జీవిత చరిత్రలు, ఫైడల్ కాస్ట్రో, చేగువేరా, పూనం మాలకొండయ్య, పాలగుమ్మి సాయినాథ్, రవీంద్రనాథ్ ఠాగూర్, కుష్వంత్ సింగ్, నిర్భయ, ఇంకా అనేక దిన, వార, మాస పత్రికల ఎడిటర్లు, వాళ్ళ రచనలు ... స్ఫూర్తి ప్రదాతలు.

మా ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తూ అందరు ఉపాధ్యాయులను అత్యంత క్రమశిక్షణతో, స్నేహ, సౌభాతృత్వాలతో నడిపించి విద్యారంగంలోనే తలమాణికంగా మారిన బుట్టి వెంకటరెడ్డి మాస్టారుకి (ఇప్పుడు స్వర్గస్థులైనారు) నిత్య స్మరణతో సాష్టాంగ ప్రణామాలు.

బెల్గాంలో బిఎడ్ కాలేజీలోని సైకాలజీ బోధించే (ఆయనే ప్రిన్సిపల్ కూడా)శుపూర్కర్, జీవశాస్త్ర మెథడాలజీ బోధకులు బి.ఎస్.పాటిల్ గార్లు సమాజంలో నన్ను ఉపాధ్యాయునిగా నిలబెట్టారు.

కాకతీయ యూనివర్సిటీలో ఎం.ఎ తరగతులు తీసుకున్న చంద్రమౌళి, పురుషోత్తం, సురేందర్ లెక్చరర్లు నన్ను రచయితగా, సాహితీ విమర్శకునిగా, పుస్తక ప్రియునిగా మార్చారు. ఈ శీర్షిక ద్వారా వారందరికీ నా నమస్సులు తెలియజేసుకుంటున్నాను. ఇటువంటి మంచి శీర్షిక పెట్టిన ఎడిటర్ గారికి కృతజ్ఞతలు.

- జి. సుధాకర్ రెడ్డి, తొగుట, మెదక్

నా తల్లే నా దైవం

చిన్నప్పటి నుండి అన్నీ నేర్పించిన మా అమ్మనే గురువుగా భావిస్తాను. నిద్ర పుచ్చడానికి చెప్పే కథలతో ఎంతో స్ఫూర్తిన్నింది. ఆమె నేను చదువుకున్న స్కూల్లో తెలుగు టీచరు కావడంతో ఆ అనుబంధం ఇంకా ఎక్కువ. తెలుగు వాచకంలోని ప్రతి పాఠమూ విడమర్చి, అర్థమయ్యేట్లు చెప్తారు. అలాగే మా సైన్స్ మాస్టారు జీవితంలో ఎలా వుండాలో వివరిస్తారు. సోషల్ టీచర్ జీవితాన్ని పురాణాలకు అన్వయించి, పొరపాట్లు జరగకుండా నేర్పుగా ఎలా వుండాలో చెప్తారు. ఇలా నాలో స్ఫూర్తినింపిన అందరికీ నా నమస్కారాలు.

- తిరునగరి సంధ్య,
పదవ తరగతి, పాండురంగాపురం, ఖమ్మం

జోక్స్ కార్నర్

ముందుకొస్తే కోపం

బిచ్చగాడు : అయ్యా ధర్మం చెయ్యండి

వ్యక్తి : నా ముందు అడుక్కుంటే నాక్కోపం వస్తుంది.

బిచ్చగాడు : (ఆ వ్యక్తి వెనక్కి వెళ్ళి) అయ్యా ధర్మం...

కలలో!

శ్రీకాంత్ : పద స్కూల్‌కి వెళ్దాం

గంగాధర్ : నేను రానురా. నిన్న నేను రాంబాబును కొట్టాను. ఆ పగతో వాడు నన్ను కొడితే...

శ్రీకాంత్ : నాకు తెలీకుండా ఎప్పుడు కొట్టావురా?

గంగాధర్ : రాత్రి కలలో.

వంద/వెయ్యి

ప్రొడ్యూసర్ : ఏరా! మగధీర సినిమా స్టోరీ చెప్పి, దాన్ని నువ్వే రాశానని చెప్తావా? ఎంత ధైర్యం నీకు.

మోహన్ : మగధీరలో రాంచరణ్ వంద మందిని మాత్రమే చంపుతాడు. మరి నా సినిమా కథలో వెయ్యి మందిని చంపుతాడు. రెండింటికి ఈ తేడా ఉందిగా.

మర్యాదగా



రామ్ : రాత్రి నాగార్జున నా కలలోకి వచ్చి నీతో ఏదో చెప్పాడురా!

లక్ష్మణ్ : ఏమన్నాడో చెప్పు?

రామ్ : అన్నది నీతో. ఏమన్నాడో మర్యాదగా చెప్తావా? లేదా?

జాగ్రత్త పడతారు

అవేజ్ : టీచర్ పురుగుల మందు తాగితే మనుషులు కూడా చస్తారా?

టీచర్ : అవును.

అవేజ్ : అలాగైతే సీసామీద పురుగులు మందుతోపాటు మనుషుల మందు అని కూడా రాయాలి.

అయితే వెనక్కి



డాక్టర్ : చూడండి... మీ వాడిని గంట క్రితం అంటే పదింటికి తెచ్చుంటే బతికేవాడు. ఇప్పుడు మేమేం చేయలేం.

పేషెంట్ తాలూకు వ్యక్తి : అయితే గడియారాన్ని వెనక్కి తిప్పి వైద్యం చేయండి.

మూగవాణ్ణి

ఒకటవ వ్యక్తి : బాబూ! హైదరాబాద్ బస్సు ఎప్పుడు వస్తుంది?

రెండో వ్యక్తి : నాకు మాటలు రావండి. మూగవాణ్ణి.

పిసినారితనం

కిరణ్ : అన్నంలో ఇంతగనం ఉప్పు వేశావేంటి?

సాగర్ : బస్తా ఉప్పు ఇంట్లో వున్నప్పుడు చిటికెడు వేస్తే పిసినారి అనుకుంటారేమోనని రెండు చెంబుల ఉప్పు వేశా.

– రత్నావత్ పంచారామ్,
ఊట్‌పల్లి, బోధన్

స్ఫూర్తినిచ్చిన గురువు ఎవరు?

బడికి వెళ్ళినప్పట్నించి కాలేజీ దశ వరకు ఎందరో ఉపాధ్యాయులు మనకు పాఠాలు బోధిస్తారు. వారిలో కొంతమంది గుర్తుండిపోతారు. కొందరు గొప్ప స్ఫూర్తిని ఇస్తారు. వారు చెప్పిన పాఠాలుగానీ, కొన్నిమంచి మాటలు గానీ మనసులో ముద్రించుకుపోతాయి. ఆవిధంగా మిమ్మల్ని ప్రభావితం చేసిన ఉపాధ్యాయుల గురించి ఈ శీర్షికకి రాయండి. మీకు స్ఫూర్తినీ, ఉత్తేజాన్నీ ఇచ్చి ప్రోత్సహించిన ఉపాధ్యాయుల్ని ఈ శీర్షిక ద్వారా గుర్తు చేసుకోండి.

మీ రచనతో పాటు ఫోటో కూడా పంపండి. 'సోపతి'లో ప్రచురిస్తాం.

చిరునామా: సోపతి, ప్రజాశక్తి ఆదివారం సంచిక, ప్రజాశక్తి తెలుగు డైలీ, 21/1, ఎమ్.హెచ్.భవన్, అజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగలింగంపల్లి, హైదరాబాద్-20

రచయితలకు సూచనలు

✎ 'సోపతి' కోసం వ్యాసాలు, కథలు, కవితలు పంపించండి.

✎ కథకు పేజీల పరిమితి లేదు. కథ అయి వుండాలి, అంతే! చదివించే గుణమే ప్రధానం.

✎ అనువాద కథ, కవితలు కూడా పంపించవచ్చు. మూల రచయిత అనుమతి పత్రం తప్పనిసరి.

✎ యాత్రా కథనాలకు ప్రత్యేక ప్రాధాన్యం. మీరు చూసి వచ్చిన ప్రదేశాల గురించి, మీ అనుభవ నేపథ్యంలో రాసి, తగిన ఫోటోలతో పంపించండి.

✎ రచనల్ని తిప్పి పంపాలనుకునేవారు తగిన స్టాంపులున్న కవర్‌ని జత చేయాలి.

✎ రచనతో పాటు రచయిత అడ్రసు ఉండాలి.పిన్‌కోడ్ నెంబరు తప్పనిసరి అవసరం. మీ ఫోను నెంబర్, వీలయితే ఈమెయిల్ కూడా ఇవ్వడం మంచిది.

✎ రచనల ప్రచురణకు సంబంధించి ఫోన్లలో ఎలాంటి సంప్రదింపులకు తావు లేదు.

✎ ఆరోగ్యకరమైన హాస్య, వ్యంగ్య రచనలకు ప్రాధాన్యం వుంటుంది.

✎ సమీక్షకోసం పుస్తకాలు పంపేవారు రెండు ప్రతులు పంపించాలి.

చిరునామా: సోపతి, ప్రజాశక్తి ఆదివారం సంచిక, ప్రజాశక్తి తెలుగు డైలీ, 21/1, ఎమ్.హెచ్.భవన్, అజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగలింగంపల్లి, హైదరాబాద్-20

■ **వ్యంగ్య రచన**

అటు - ఇటు

ఇంకా పూర్తిగా తెలవారకముందే ఆ కాలనీలో గగ్గోలు – జనం హాహాకారాలు చేస్తున్నారు. చాలామంది ఇండ్ల తలుపులు, కిటికీలు బిడాయించుకున్నారు.

రోడ్డుమీద జనం వురుకులు, పరుగులు... వార్త అప్పటికే బయటకు పొక్కడంతో అరడజను టీవీ ఒ.బి. వ్యాన్లు, రెండు జీబుల మంది పోలీసులు బిలబిలమని దిగిపోయారు.

“ఏది? ఎక్కడ?” యస్పై అక్కడ గుంపును అడిగాడు.

“నేను చెప్తాసార్. నేనే మొదట చూసింది. నాకు తెల్లవారు జామునే తలనొప్పి, హాంగోవరు. రాత్రి లోటస్‌లో ఫుల్ మందుపార్టీ – అబ్బో మన కార్పొరేటరు యమ రంజుగా...”

‘విషయం చెప్పు’ యస్పై నిగ్రహించుకుంటూ అడిగాడు.

“అది సార్... అక్కడో బెల్టు షాపుంది. 2 నిబ్బు పీకి వస్తుంటే అది అదుగో ఆ కాంపౌండు గోడమీద నుండి కనకరత్నం గారి అపార్టుమెంటులోకి దూకింది. అబ్బో.. ఏం జంపూ...”

అతను చెప్పడం ఆపి యస్పై గారి బెల్టులోని రివాల్వర్ వంక భయంగా చూశాడు.

“అదిపుడు అక్కడే వుందా.. హర్రీ” యస్పై తొందరపెట్టాడు.

“సార్” ఆ అపార్టుమెంటులో ఒక పోర్షనులో కిరాయికి వుంటున్నా సార్. నేను చూసిన. దాని గాండ్రింపులకు నా లుంగీ తడిసిపోయింది. నేను రోడ్డుమీదకు దూకాను.

“సర్సరే... ఇప్పుడది ఎక్కడ?”

“సార్... ఆ సందునుండి రెండో లైన్లోకి పోయింది. ఆ లైను అక్కడితో కట్టే! అవతల లైను లేదు” తడిసిన లుంగీని ఆప్యాయంగా ఎగదోసి కట్టుకుంటూ చెప్పాడు.

“కమాన్” యస్పై ఆర్డరు వేశాడు. జీబు దగ్గరే బిక్కముఖాలు వేసి లాఠీలు వూపుతున్న పోలీసులు హడలిపోయారు. ఒక వయసు మళ్ళిన హెడ్డు యస్పైతో నెమ్మదిగా గొణిగాడు.

“సార్ అది చిరుతపులి, పెద్ద పులి కూడా కావచ్చు. అడవిలో విచ్చలవిడిగా తిరిగేది. టవున్లోకి ఎందుకు వచ్చిందో. ఎవరికోసం వచ్చిందో తెలవదు.”

“షటప్... కమాన్” కుర్ర యస్పై కసిరాడు.

“అది కాద్సార్. పిస్తోలు తీసి ఎంతటి టెర్రరిస్టునైనా హాండ్సప్ అంటే చేతులెత్తేస్తాడు. మరి ఈ అడవి జంతువుకు ఆ రూల్సూ, ప్రొసీజరు తెలవదు కదా.. అది ఎగిరి మన మీదకు దూకితే దారేది?” మరో విజ్ఞుడైన పోలీసు ఉచిత సలహా పారేశాడు.

“సార్.. పట్టణంలోకి ప్రవేశించిన చిరుత పులిని ఎట్లా పట్టుకుంటారు?”

“సార్... ఇంతకీ అది ఎక్కడ నక్కిదాక్కుందో కనిపెట్టారా?”

“సార్.. అసలు అది ఎవరింటికి బయలుదేరి వచ్చివుంటుందని మీ అనుమానం...”

“ఈ చిరుత ఇట్లా టవున్లోకి రావడం వెనుక ఎవరిదైనా కుట్ర దాగుందనుకుంటున్నారా?”

యాంకర్ల ప్రశ్నలకు యస్పై ఆవేశపడిపోయాడు.

“అరె.. మీదడిగేదేంది? ఎట్లా పట్టుకుంటాం... చేతుల్తో.. దొంగలకు, కేడీలకు హాండ్‌కఫ్స్ వేస్తాం. అట్లాగే యస్.. అది ఎక్కడో నక్కి వుంటుంది. మేం వెతికి పట్టుకుంటాం. అది మా డ్యూటీ”

‘అమ్మా నువ్వడిగింది అది ఎవరికింటికని కదూ. దాని బంధువుల లిస్టు పరిశీలిస్తున్నాం. వారినీ ఇంటరాగేషన్ చేస్తాం”

“ఆ.. ఆ.. కుట్ర సిద్ధాంతం.. దాని మీదా దర్యాప్తు చేస్తాం. సరేనా.. యస్పైగారి వెటకారాలతో యాంకర్లు పొలోమని ప్రజల మీదకు సమాచార దాడికి దిగిపోయారు.

అప్పటికే జనం భారీగా హాహాకారాలు చేస్తూ అల్లకల్లోలంగా అటూ ఇటూ పరుగులు... లోపల వీధి చివరనుండి భయంకరమైన చిరుత గాండ్రింపులు...

“ఏమైంది.. వాట్”

“సార్... ఆ వీధి సందుకో గేటుంది. ఆ చిన్న డెడ్‌ఎండ్.. గోడనున్న కిట్టిగాడు నక్కుతూ, నేలమీద పాకుతూ, దేకుతూ”

“విషయం?” యస్పై పులిలా గాండ్రించాడు.

“వీడే సార్ కిట్టిగాడు – గప్‌చుప్‌గా పోయి లటుక్కున గేటు వేసి వచ్చాడు”

“ఎవడ్రా కిట్టిగాడు?” యస్పై పక్కకు చూశాడు. బక్క పలచని శాల్తీ. పొట్టి ముక్కు. నోరు తెరిచి పండ్లికిలించాడు.

“నువ్వేనా గేటు బిగించింది?”

“నేనే. నేలమీద పాకుతూ.. పిల్లిలా నక్కుతూ...”

“షటప్. అది లోపల చిక్కిందా”

“చిక్కుకుంది సార్. నేను చూశా. అది రెండు అరుపులు అరిచి.. నాలుగు పచార్లు చేసి.. ఒళ్ళు విరుచుకుని...”

“ఎక్సర్‌సైజులు చేస్తుందా?” యస్పై గాండ్రించాడు.

“పండుకుంది సార్... రెస్టు!”

టీవీ చానెల్ అమ్మాయిలు గోలగోలగా ఎటాక్ చేశారు.

“పులులు ఎక్సర్‌సైజులు చేస్తాయా?”

“వాకింగ్ వాటికి అవసరమా?”

“అమ్మో పులులకు రెస్టు కూడా అవసరమా సార్”

“ఇంతకీ కాప్చరింగ్ ఆపరేషన్ మొదలుపెడుతున్నారా?”

యస్పై లీవీగా చూశాడు. పోలీసులు దూరం నుండి వురికి వచ్చారు.

“పులిని ఒక మూలకు కార్నర్ చేశాం. ఇప్పుడు పట్టుకోడం చాలా వీజీ.

కానీ ఒక డేంజరుంది!"

"డేంజరా?" కిట్టిగాడు హడలిపోయాడు.

"ఈలోపు దానికి ఆకలి తిరగబెడితే అది ఎంతకైనా తెగిస్తుంది. గేటు దూకడం దానికో లెక్క కాదు. దాన్ని నిద్దర్లోనే పట్టుకోవాలి"

"సార్.. ఒసామా బిన్ లాడెన్‌ను పాక్‌లో పట్టుకున్నప్పుడు..."

యస్సై అసహనంగా చూసిండు "దాన్ని బంధించడం జూ అధికారుల పని. వాళ్లు బయలుదేరారు" సెల్ టకటక లాడించాడు.

అంతలోనే పెద్ద వ్యాను- ఇనుప వలలు, నిచ్చెన్లు, పెద్ద బోను, సిబ్బందీ బిలబిల దిగిపోయింది.

లావుగా.. బెల్టు బిగుతుగా, బొజ్జ గల జూ అధికారి అడిగిండు "సర్... మన క్రీచర్ ఎక్కడ?"

"సార్, ఆ సందులో ... నేను చూపిస్తా?" కిట్టిగాడు పాకడానికి తయారైపోయాడు.

"ఓకే... ఫాలోమీ. నడు" ఆయనగారి సిబ్బంది ఇనుప వలలతో తయారైపోయారు.

మూకుమ్మడిగా, ముసురుకుని ముందుకు రాబోతున్న జనాల్ని అదుపు చేయడానికి పోలీసులు లాఠీలు తిప్పుతున్నారు.

చానల్ యాంకర్లు యస్సైని వదిలిపెట్టి జూ అధికారి వెంటబడ్డారు.

"అడివిలో వుండాల్సిన చిరుతలు టవున్ల మీదకు ఎందుకు ఎగబడతాయి సార్"

"ఏమో దాన్నే కనుక్కుందాం" ఒక జోకు పేల్చి, బొర్ర నిమురుకుని ముందుకు దూకాడు.

యాంకర్లు వెంటవెంటనే న్యూస్‌ను ఛానల్‌కు అందిస్తున్నారు. జనాల్ని వెనక్కి తోస్తూనే పోలీసులు సుడిపడ్డరు. ఎంతైనా జనాల్లో కుతూహలం ఎక్కువ. కొంతమంది బిల్డింగుల మీదకి ఎగబాకారు. దగ్గర్లోని చెట్ల కొమ్మలెక్కారు కొందరు.

కిట్టిగాడు ముందూ... సిబ్బంది వెనకా... కాంపౌండులోకి దూకారు. అంతా ఆరాటం. జనాలు ఊపిరి బిగబట్టారు.

"ఘాండ్రు" అని భయంకరమైన చప్పుడు.

హా హాకారం చేస్తూ జూ అధికారి తన భారీకాయాన్ని వెంటబెట్టుకుంటూ కాంపౌండులో బొక్కబోర్లా పడ్డాడు. అతని బెల్టు ఫట్‌మని తెగిపోయింది.

కిట్టిగాడు పాకుడాపి చెంగున ఎగిరి పక్కింటి కిటికీ వద్దకు చేరుకున్నాడు.

పక్కమేడ మీద నలుగురైదుగురు దడుసుకుని మెట్ల మీద నుండి పుచ్చకాయల్లా దొర్లారు. రోడ్డు పక్క చెట్ల కొమ్మల మీదెక్కి వినోదం చూస్తున్న వారిలో నుండి ఇద్దరు దబ్బున కింద పడ్డారు.

ఒక టీవీ యాంకరు అమ్మాయి కెమెరామెన్‌తో సహా విరుచుకుని ముళ్ళ పొదల్లో పడ్డది.

"ఔట్... ఔట్... ద క్రీచర్ ఎన్ రేజింగ్. చీల్చి చంపుతుందది ముందాకొడకా!" అని కిందా మీదా పడి వగరుస్తూ పోలీసు జీబు దగ్గరకు వచ్చి పడ్డాడు జూ ఆఫీసర్.

"ఏమైంది?" యస్సై అడిగాడు.

"విన్లేదా... అది రెచ్చిపోయింది. డేంజర్. ట్రాంక్విలైజర్ గుచ్చండిరా!" జూ అధికారి వగరుస్తూ అరిచాడు.

"ఎవరికి సార్" యాంకరు అమ్మాయి తాపీగా అడిగింది.

"నీకూ.. నీ కెమెరా గాడికి - గెట్ లాస్ట్" అరిచాడు.

"అబ్బో. పది అడుగుల పొడవుంది. బిగ్ క్రీచర్... హారిబుల్"

అంతా గందరగోళం.. జనం దూరంగా జరుగుతున్నారు. కిటికీ మీద ఎక్కిన కిట్టిగాడు రెండు ఈలలు వేశాడు.

"ఏమైందిరా?" యస్సై మండిపడ్డాడు.

"చిరుత వలలో చిక్కింది. జంబో బోను... బోనులో మారుతున్నారు" కిట్టిగాడు ఆయాసపడుతూ అరిచాడు.

"అబ్బ యస్సై గారూ... ఆపరేషన్ టైగర్ సక్సెస్. ఒకసారి చింతపల్లి అడవుల్లో... బోనులోని చిరుత బయట జనం వంక తాపీగా చూస్తుంది. టీవీ వాళ్లు బోను చుట్టూ తిరుగుతూ చిరుత కదలికలను చకచక తమ స్టూడియోలకు పంపుతున్నారు.

ఒక టీవీ అమ్మాయికి పనంతా అయిపోయినట్లనిపించింది. చివరిసారిగా ఓ క్లోజప్ షాట్ తీద్దామనుకుంది. బోను దగ్గరకు పోయి కెమెరా సరిజూసుకుంది. హలో గోటూ స్టూడియో.. రత్నా.. ఇది మన టీవీ ఎక్స్‌క్లూజివ్. వెరీ నైస్ ఒకె. ఆల్‌రైట్. సర్సెరే. అన్నట్టూ ఓ చిరుత మహారాజు గారూ తమరు హాయిగా స్వేచ్ఛగా అడవిలో సంచరించకుండా ఇలా టవున్లోకి రావడం, బోన్లో చిక్కడం ఏం బాలేదు సార్ (చిన్నగా నవ్వింది. చిరుత గురగుర మని ఆవలించింది). సర్దుకుని పోతున్న అమ్మాయి వంక చూసింది.

"ఓ అమ్మాయి ఆగు" అని పిలిచింది.

హడలిపోయి వణుకుతూ మైకు పట్టుకుని నిలబడింది.

'జర ఆ మైకు నా మూతి దగ్గర పెట్టు. నిన్నేం చేయను తల్లీ. భయం లేదు రా. దగ్గరకు రా. ప్రశ్నలడిగి జవాబు వినకుండా పోతున్నావ్" చిరుత తమాషాగా నవ్వింది.

"విను చెప్తా. మనుషులు మా అడవుల మీద పడి దాడిచేస్తున్నారు. చెట్లు నరుకుతున్నారు. నిలువ నీడ లేకుండా గుట్టలను తవ్వేస్తున్నారు. జల విద్యుత్, అణు విద్యుత్, భారీ ప్రాజెక్టులు, యంత్రాలు, ఖరీదైన ఖనిజాల కోసం తవ్వకాలు, అడవి అడవిలా వుండడం లేదు. పిట్టలక్కూడా నీడ లేకుండా తవ్వేస్తున్నారు. అభివృద్ధి పేరిట విధ్వంసం. మేం అడిగామా.. తినే మాకు తిండి కరువు. పడుకొను నీడలేదు. విధ్వంసం... మీ టవున్లు పెరిగిపోతున్నాయి. మా అడవులు ఖాళీ. మరి మీరందరూ మా అడవిమీద పడితే, మేం మీ టవును మీద పడి బతకడం న్యాయం కాదా. ఇది సహజ న్యాయం"

మైకు వదిలి టీవీ అమ్మాయి వెల్లికిలా విరుచుకు పడింది.

- రుక్మిణి

సోర్స్ కోడ్

కె.ఎక్స్.రాజు

కనువిందు చేసిన 'సీఈఎస్ 2015'

అబ్బురపరిచే సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకూ ఆవిష్కృతమవుతోంది. సరికొత్త సాంకేతిక ఆవిష్కరణలు సాంకేతిక రంగంలో కొత్త ఒరవడిని తీసుకొస్తున్నాయి. జనవరి వచ్చిందంటే చాలు టెక్నాలజీ ప్రపంచంలో సరికొత్త సందడి మొదలవుతుంది. సాంకేతిక ఆవిష్కరణలకు రోజురోజుకు క్రేజ్ పెరుగుతున్న నేపథ్యంలో అమెరికాలోని లాస్‌వేగాస్ వేదికగా ప్రతిఏటా అతిపెద్ద టెక్నాలజీ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తుంటారు. దీనిపేరే 'కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ షో' (సిఈఎస్). 2015కు గాను ఈ టెక్ ఎక్స్‌పోను జనవరి 6 నుంచి 9 వరకు అమెరికాలోని లాస్‌వేగాస్‌లో నిర్వహించారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 'కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ షో' ద్వారా భవిష్యత్ ఎలక్ట్రానిక్ ఉపకరణాల తీరు తెన్నులను ప్రపంచానికి పరిచయం చేస్తారు. ఈ ప్రదర్శనను వేదికగా చేసుకుని అన్నిరకాల ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల తయారీ కంపెనీలు పోటాపోటీగా తమ ఉత్పత్తులను ఇక్కడ ఆవిష్కరిస్తాయి. ఈ క్రమంలో ప్రస్తుత ప్రదర్శనలో సరికొత్త స్మార్ట్‌ఫోన్‌లు, స్మార్ట్‌వాచ్‌లు, స్మార్ట్ టీవీలతో పాటు ఎల్‌జీ, లెనోవో, ఆసుస్, షియోమీ, హెచ్‌టీసీ వంట సరికొత్త క్రియేటివ్ టెక్నాలజీని ఆవిష్కరించాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల తయారీ కంపెనీలు పోటాపోటీగా 20,000లకు పైగా కొత్త ఉత్పత్తులను ఇక్కడ ప్రదర్శించాయి. సీఈఎస్ 2015లో 140కి పైగా దేశాల నుంచి 3673 ప్రదర్శనకారులు పాల్గొన్నట్లు అంచనా. వీటిలోని కొన్నింటి గురించి తెలుసుకుందాం...

లెనోవో స్మార్ట్‌బ్యాండ్ : లెనోవో 'వైబ్ బ్యాండ్ వీబీ10' పేరుతో తన మొట్టమొదటి స్మార్ట్ బ్యాండ్‌ను ఆవిష్కరించింది. ఇ-ఇంక్ డిస్‌ప్లేతో పనిచేసే ఈ బ్యాండ్ 7 రోజులు సుదీర్ఘమైన బ్యాటరీ బ్యాకప్‌తో ఉంటుందని కంపెనీ వెల్లడించింది. పటిష్టమైన వాటర్ ప్రూఫ్ వ్యవస్థతో రూపకల్పన చేయబడిన ఈ వైబ్ బ్యాండ్‌లో ప్రత్యేకమైన ఫిట్నెస్ పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసారు. ఈ వ్యవస్థ యూజర్ ఫిట్నెస్ స్థాయిని మానిటర్ చేస్తూ తగు ఆరోగ్య సూచనలను చేస్తుంది. పొందుపరిచిన యాంటీ గ్లేర్ స్కీన్ ఎండలో సైతం బ్యాండ్ డిస్‌ప్లేను క్రిస్టల్ క్లియర్ క్వాలిటీలో కనిపించేలా చేస్తుంది.

ఇంటర్నెట్ ఫోన్ 'నోకియా 215' : మైక్రోసాఫ్ట్ చౌక ధర ఇంటర్నెట్ ఫోన్ 'నోకియా 215' స్మార్ట్‌ఫోన్‌కు అనుసంధానం చేయటం ద్వారా కాల్స్, ఎస్ఎమ్ఎస్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఉయ్‌చాట్ తదితర అంశాలకు సంబంధించిన నోటిఫికేషన్‌లను ఆన్‌టైమ్‌లో బ్యాండ్ తన డిస్‌ప్లే చూపుతుంది. 150 పదాలతో కూడిన ఎస్ఎంఎస్‌లను ఈ బ్యాండ్ ద్వారా పంపుకోవచ్చు.

ఎల్‌జీ 'జీ ఫ్లెక్స్ 2' : ఈ స్మార్ట్‌బ్యాండ్‌లో ఏర్పాటు చేసిన ప్రాక్సిమిటీ రిమైండర్ ఎప్పటికప్పుడు యూజర్‌ను అప్రమత్తం చేయటం ద్వారా ఫోన్‌ను పోగొట్టుకునే ప్రమాదం నుంచి పూర్తిగా బయటపడవచ్చు. ఆండ్రాయిడ్ ఇంకా యాపిల్ ఐఓఎస్ మొబైల్ డివైస్‌లను ఈ బ్యాండ్ సపోర్ట్ చేస్తుంది. ధర 89 డాలర్లు. ఇండియన్ మార్కెట్లో అందుబాటుకు సంబంధించి పూర్తి వివరాలు వెల్లడికావల్సి ఉంది.

సోనీ ఎక్స్‌పీరియా జెడ్4: సోనీ తన ఫ్లాగ్‌షిప్ మోడల్ ఫోన్ ఎక్స్‌పీరియా జెడ్4ను ఆవిష్కరించింది. ఫోన్ ఫీచర్లు... 5.2 అంగుళాల క్యూహైడెఫినిషన్ స్క్రీన్, స్నాప్ డ్రాగన్ 810 ప్రాసెసర్, 3జీబి ర్యామ్, 20.7 మెగా పిక్సల్ రేర్ కెమెరా, 5 మెగా పిక్సల్ ఫ్రంట్ ఫేసింగ్ కెమెరా, 4జీ ఎల్టీఈ కనెక్టువిటీ, ఆండ్రాయిడ్ 5.0 లాలీపాప్ ఆపరేటింగ్ సిస్టం. వీటితో పాటు హెచ్‌టీసీ డిజైర్ ఫోన్, షియోమీ ఎమ్ఐ 5, అసుస్ జెన్‌ఫోన్ సిరీస్, ఏసర్ 4జీ ఎల్టీఈ స్మార్ట్‌ఫోన్, వ్యూసోనిక్ వీ55 వంటి స్మార్ట్‌ఫోన్లను ఆవిష్కరించారు.

స్మార్ట్ బైసైకిల్ పెడల్ : జీపీఎస్ ఆధారంగా స్పందించే ఈ స్మార్ట్ పెడల్ యూజర్ వాహనాన్ని రైడ్ చేస్తున్న తీరును విశ్లేషించటంతో పాటు కరిగిస్తోన్న శరీర క్యాలరీల వివరాలను కూడా సూచిస్తుంది.

జీఏజీఎల్ స్మార్ట్ బాటిల్ : ఈ సరికొత్త సాంకేతికత చిన్నారులను మానిటర్ చేస్తూ ఆ వివరాలను తల్లిదండ్రులకు చేరవేస్తుంది.

అడిడాస్ స్మార్ట్ ఫుట్‌బాల్ : ఈ స్మార్ట్ ఫుట్‌బాల్ ప్రత్యేకమైన సెన్సార్‌లను కలిగి ఉంటుంది. వేగం, స్పిన్, ఫ్లైట్ పాత, కిక్ డేటా, ఇంపాక్ట్ పాయింట్ వంటి అంశాలను స్మార్ట్ ఫుట్‌బాల్ తెలుపుతుంది.

ఎయిర్ : ఈ బ్లూటూత్ స్పీకర్ గాల్లో తేలుతుంది.

ఈడెన్ గార్డెన్ సెన్సార్, వాటర్ వాల్వ్: ఈ స్మార్ట్ గార్డెనింగ్ సిస్టం వాతావరణానికి అనుగుణంగా మొక్కలకు నీరు అందిస్తుంది.

ఎప్సిలాన్ ఎక్స్‌ట్రీమ్: ఈ క్వాలిటీ సౌండ్‌ను ఈ డివైస్ ఉత్పత్తి చేస్తుంది.

నోక్: ప్రపంచపు మొట్టమొదటి బ్లూటూత్ ఆధారిత ప్యాడ్‌లాక్.

క్వాల్కమ్ వైపవర్ : ఈ క్రియేటివ్ గాడ్జెట్ ఫోన్‌లకు వైర్‌లెస్‌గా చార్జింగ్‌ను అందిస్తుంది.

సామ్‌సంగ్ 105 అంగుళాల యూఎన్105ఎస్9బి టీవీ: ప్రపంచపు అతిపెద్ద అల్ట్రా హైడెఫినిషన్ టీవీగా ఈ డివైస్ గుర్తింపు తెచ్చుకుంది.

స్నాప్ : ఈ ఎల్ఈడీ ల్యాంప్‌ను ఇండోర్, అవుట్ డోర్ వాతావరణాల్లో ఉపయోగించుకోవచ్చు. కెమెరా, మైక్రోఫోన్, స్పీకర్, క్లౌడ్ రికార్డింగ్, ప్లేబ్యాక్ వంటి ప్రత్యేకతలు ఉన్నాయి.

సోనీ ఏ7ఎస్ పూర్తి ఫ్రేమ్ మిర్రర్‌లెస్ కెమెరా: ఈ డివైస్ ప్రపంచపు అతిచిన్న పూర్తి ఫ్రేమ్ ఇంటర్‌చేంజబుల్ లెన్స్ కెమెరాలలో సోనీ ఏ7ఎస్ ఒకటి. 4కే వీడియో క్వాలిటీతో కూడిన ప్రొఫెషనల్ స్థాయి ఫోటోగ్రఫీని ఈ కెమెరా ద్వారా ఆస్వాదించవచ్చు.

ద దాష్ : ఈ వైర్‌లెస్ స్మార్ట్ హెడ్‌ఫోన్ క్రిస్టల్ క్లియర్ క్వాలిటీతో కూడిన సౌకర్యవంతమైన ఆడియోను ఉత్పత్తి చేస్తుంది.

వీటితో పాటు ఫిడిలియో బీ5 వైర్‌లెస్ సరౌండ్ ఆన్ డిమాండ్ సౌండ్ బార్, ఐక్యామ్ హైడెఫినిషన్ ప్రో, ఐహెల్త్ ఎలైన్, మల్టీ ఫంక్షన్ ఎయిర్‌లైట్ (జెడ్-ఎయిర్), నైట్‌హాక్, టయోటా ఇకో ఫ్రెండ్లీ కార్, స్మార్ట్ ప్లాన్ పాట్, ఎడిబుల్ 3డీ కుకీ, వెజ్జీ గ్రీన్ బాక్స్, స్మార్ట్ ఎక్సర్‌సైజ్ చైర్, సెల్ఫీ స్టిక్, యాక్సిస్ సీఈ ఎయిర్2 ఫ్లోటింగ్ బ్లూటూత్ స్పీకర్స్ వంటి అనేక అద్భుతమైన టెక్నాలజీలను ఆవిష్కరించారు.

- రచయిత సెల్ : 9490099219

హోమియో చికిత్సతో జీర్ణాశయ సమస్యలు దూరం

కడుపులో మంట, కడుపులో ఉబ్బరం, ఏది తినాలన్నా తినలేని పరిస్థితి, ఒక ముద్ద తింటే చాలు కడుపు నిండిపోతుంది. తిన్నా, తినకపోయినా పొట్ట గట్టిగా అనిపించడం... మరి ఈ సమస్యకు పరిష్కారం లేదా? అంటే ఆధునిక హోమియో చికిత్సతో గ్యాస్ట్రిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించవచ్చని అంటున్నారు డాక్టర్ మధు వారణాసి.

మానవ జీవితంలో అతి ప్రాముఖ్యమైనది ఆరోగ్యకరమైన జీవితం. ఆరోగ్యంగా వుంటే ఎలాంటి ఒత్తిడినైనా ఎదుర్కోవచ్చు. ప్రస్తుత జీవన విధానంలో ఎన్నో మార్పులు. ఆహారంలో మార్పుల వల్ల చాలా మంది కడుపులో మంట, అల్సర్, కేన్సర్ లాంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు.



ఏం జరుగుతుంది?

మానవ శరీరంలో అన్నింటికన్నా జీర్ణాశయ వ్యవస్థ చాలా పెద్దది. మనకు వచ్చే వ్యాధుల్లో 80 శాతం వ్యాధులు జీర్ణ వ్యవస్థకు సంబంధించినవే కావడం గమనార్హం. జీర్ణ మండలం నోటితో ప్రారంభమయి ఆసనంతో అంతమవుతుంది. మనం నిత్యం తీసుకునే అనేక రకాల ఆహారపదార్థాలు, ఆహారనాళం ద్వారా ప్రవేశించి జీర్ణాశయం చేరుతుంది. జీర్ణాశయం చేరిన ఆహారం ఎన్నో రసాయన మార్పులు చెంది చిన్న పేగుల ద్వారా ప్రయాణించి, పెద్ద పేగులను చేరుతుంది. అక్కడ మిగిలిన వ్యర్థపదార్థాలు మల రూపంలో ఆసనం ద్వారా బయటకు విసర్జించబడతాయి. ప్రతి వ్యక్తికీ జీర్ణాశయంలో ఆకలి కలగడానికి పెప్సిన్ అనే ఎంజైమ్, జీర్ణం కావడానికి హైడ్రోక్లోరిక్ ఆమ్లం ఉత్పత్తి అవుతూ ఉంటుంది. సమపాళ్లలో ఇవి ఉత్పత్తి అయినప్పుడు జీర్ణ ప్రక్రియలో, పొట్టలో ఎటువంటి బాధలూ ఉండవు. జీవన విధానంలో ఆహార మార్పుల వల్ల, విరుద్ధ ఆహార పదార్థాలు తినడం వల్ల, మసాలాలు, మధ్యపానం, మాంసాహారం మితిమీరి తినడం వల్ల జీర్ణాశయంలో ఆమ్లాధికృత అధికమై అసంపూర్ణంగా జీర్ణం కాని పదార్థాల వల్ల పొట్టలో మంట, ఛాతీలో మంటతో మొదలయి హైపర్ ఎసిడిటిగా మారుతుంది. ఈ యాసిడ్ అలానే ఎక్కువగా ఉత్పత్తి అయినప్పుడు కడుపులో అల్సర్ మొదలవుతుంది. ఈ అల్సర్ దీర్ఘకాలంలో కేన్సర్‌గా మారవచ్చు. వీటిని మనం గ్యాస్ట్రిక్ వ్యాధులంటాము.

కారణాలు

మానసిక ఆందోళన, అశాంతి, అసూయం, అతిగా కోపం, తిన్న ఆహారం జీర్ణం కాకముందే మళ్ళీ తినడం, మసాలాలు అధికంగా తినడం, నిల్వ ఉంచిన పదార్థాలు తీసుకోవడం, కాఫీ, టీలు ఎక్కువగా తాగడం, వేపుళ్ళు, పులుసు పదార్థాలు అధికంగా తినడం, రాత్రివేళ ఆలస్యంగా భోజనం చేయడం, నిద్రలేమి వంటి కారణాలు గాస్ట్రిక్ సమస్యలకు దారి తీస్తాయి. నొప్పి నివారణ మాత్రలు వాడడం, స్టెరాయిడ్స్, అలర్జీ, ఉబ్బసం, చర్మవ్యాధులకు వాడే మందుల వల్ల జీర్ణాశయంలో ఆమ్లం ఎక్కువగా ఉత్పత్తి అయి గ్యాస్ సంబంధింత వ్యాధులకు దారి తీస్తుంది.

కడుపు ఉబ్బరం

జీర్ణాశయంలో ఉన్న కొన్ని బ్యాక్టీరియాలు మనం తీసుకునే ఆహార పదార్థాలను జీర్ణం అయ్యేలా చేస్తాయి. ఏ కారణంగానైనా ఈ బ్యాక్టీరియాలు తగినన్ని జీర్ణకోశంలో లేకపోతే మనం తిన్నది జీర్ణం కాక గ్యాస్ ఉత్పత్తి అయి కడుపులో ఉబ్బరం తయారవుతుంది. చాలా మందిలో కొంచెం ఆహారం తీసుకోగానే కడుపు నిండినట్లుగా అవుతుంది. ఆహారం తీసుకున్న తరువాత తేన్పులు వస్తాయి. ఎప్పుడూ వికారంగా ఉంటుంది. కొన్ని సార్లు వాంతి అయిన తర్వాత ప్రశాంతంగా వుంటుంది. పొత్తి కడుపులో నొప్పి వుంటుంది.

డా॥మధు వారణాశి ఎం.డి
ప్రముఖ హోమియో వైద్య నిపుణులు
ప్లాట్ నెం.188,
వివేకానంద నగర్ కాలనీ
కూకట్‌పల్లి, హైద్రాబాద్.
ఫోన్ : 8897331110,
8886509509



కడుపులో పుండు

ఎసిడిటీకి సరియైన చికిత్స తీసుకోకపోతే పరిస్థితి తీవ్రంగా మారి జీర్ణాశయ కణజాలం దెబ్బతిని పుండుగా మారుతుంది. దీనినే పేగుపూత అంటారు. ఇది రెండు రకాలుగా వుంటుంది. ఒకటి గ్యాస్ట్రిక్ అల్సర్, రెండు డుయోడినల్ అల్సర్. ఈ అల్సర్ ఒకటిగాని, అనేకం గానీ ఏర్పడవచ్చు. తరుచుగా కడుపు నొప్పి రావడం, రాత్రుళ్ళు నిద్రపట్టకపోవడం, అజీర్తి, క్రమంగా ఆకలి తగ్గడం, కొన్నిసార్లు రక్త వాంతులు రావడం జరగవచ్చు. అల్సర్ జీర్ణాశయ వెనుక భాగంలో ఏర్పడితే దాని ప్రభావం పాంక్రియాస్‌పై పడి వెన్నులో నొప్పి రావచ్చు. కొన్ని సార్లు విరేచనంలో రక్తస్రావం నల్లగా కావచ్చు. కొన్నిసార్లు రక్తస్రావం జరిగి ఎమర్జెన్సీ సర్జరీ చేయాల్సి రావచ్చు.

కడుపులో కేన్సర్

అల్సర్‌కు సరియైన చికిత్స తీసుకోకపోవడం వల్ల జీర్ణాశయంలోని లైనింగ్ పొర దెబ్బతిని కేన్సర్‌గా మారవచ్చు. జీర్ణాశయంలో వచ్చే కేన్సర్ రెండు రకాలుగా వుంటుంది. ఒకటి జీర్ణాశయంలో కేన్సర్ ట్యూమర్ ఏర్పడడం, రెండు శరీరంలో ఏ ప్రాంతంలోనైనా కేన్సర్ రావడం. జీర్ణాశయానికి కేన్సర్ సంక్రమించిన వారికి ఆకలి తగ్గిపోవడం, బరువు తగ్గడం, వెంట్రుకలు ఊడిపోవడం, ఆహారం తీసుకోకపోయినా కడుపు నిండుగా ఉండడం, రక్త హీనత, విరేచనాలు, మలబద్ధకం, వాంతిలో రక్తం పడడం, విరేచనం రంగు మారుతూ ఎర్రగా, నల్లగా, వంకాయ రంగులో అవుతుండడం జరుగుతుంది.

హోమియో చికిత్స

మనిషి పుట్టుకకు మూలం ఆహారం. అతనికి వస్తున్న వ్యాధులకు మూలమూ ఆహారమే. కాబట్టి ఆహార విషయంలో సరియైన క్రమబద్ధతను పాటిస్తే చాలా సమస్యలు దరిచేరవు. ఆధునిక వైద్య విధానంలో గ్యాస్ సంబంధిత వ్యాధులు తాత్కాలికంగా తగ్గుతాయి. హోమియోపతిలో గ్యాస్ట్రిక్ సమస్యలను నిర్మూలించడానికి అద్భుతమైన మందులు వున్నాయి. ఇవి సామాన్యంగా రోగి తత్వాన్ని బట్టి పని చేస్తాయి. హోమియో మందులు రోగనివారకాలుగానే కాకుండా శాశ్వత నిరోధకాలుగా పని చేస్తాయి. అనుభవజ్ఞుడైన హోమియో వైద్యుని పర్యవేక్షణలో మందులు వాడితే గ్యాస్ట్రిక్ సమస్యలు శాశ్వతంగా దూరమవుతాయి.

*

అందుకున్నాం



భూమధ్య రేఖ
కాశిరాజు కవిత్వం
వెల : 80/-
పేజీలు : 94
ప్రతులకు :
అన్ని ప్రముఖ పుస్తక
విక్రయ కేంద్రాలు

కావ్య గణపతి - అష్టోత్తరం
కపిలవాయి లింగమూర్తి
వెల:150/-, పేజీలు : 168
ప్రతులకు : కపిలవాయి సంధ్య అశోక్, ఇం.నెం. 17-110, వాణీ సదనం, విద్యానగర్ కాలనీ, నాగర్ కర్నూల్. శ్రీ గోపాల బుక్ హౌస్





విషాదనాయిక
మోరియ
జాన్ మిల్లింగ్టన్ సిన్జ్
స్వేచ్ఛానువాదం : శివలక్ష్మి
వెల : 30/-, పేజీలు : 32
ప్రతులకు : విశాలాంధ్ర, ప్రజాశక్తి, నవోదయ, దిశ పుస్తక విక్రయ కేంద్రాలు

ఒక రాత్రి
మరొక పగలు
కోడూరి విజయకుమార్
వెల : 50/-
పేజీలు : 123
ప్రతులకు :
అన్ని ప్రముఖ పుస్తక
విక్రయ కేంద్రాలు

స్నిగ్ధ చ్ఛాయ
డా॥ధేనువకొండ
శ్రీరామమూర్తి
వెల : 100/-
పేజీలు : 138
ప్రతులకు :
అన్ని ప్రముఖ పుస్తక
విక్రయ కేంద్రాలు

■ సమీక్షలు

ఆత్మగౌరవం ప్రభవించిన ఆత్మకథ

నియతి - నా ఆటోబయోగ్రఫీ
రచన: భూతం ముత్యాలు,
పేజీలు: 80, వెల:రూ. 50
ప్రతులకు: భూతం ముత్యాలు,
4-11-117/1, చైతన్యనగర్, దేవరకొండ రోడ్డు,
నల్లగొండ-508 001

ఎవరి అనుభవాలు వాళ్ళే రాయాలన్న వాదం పదునెక్కిన నేపథ్యాన దళితవాదం వికసించి విస్తరించింది. కొత్తతరం కవులతో, రచయితలతో ఆ కొనసాగింపు కనిపిస్తోంది. ఈ క్రమంలోనే ఇరవయ్యోకటో శతాబ్ది ఆరంభం నుంచి రచనలు చేస్తున్న సృజనశీలి భూతం ముత్యాలు. నల్లగొండ జిల్లాకు చెందిన కవి, కథకుడు, నవలాకారుడు, విమర్శకుడు ముత్యాలు. వృత్తిరీత్యా ఉపాధ్యాయులు. 'మాండలీకం' అనే తెలంగాణ వృత్తి పదకోశాన్ని కూడా వెలువరించారు ముత్యాలు. ఈమధ్యన 'నియతి - నా ఆటోబయోగ్రఫీ' శీర్షికన తన ఆత్మకథని వెలువరించారు. ఎలాంటి నేపథ్యంలోంచి ముత్యాలు ఎదిగివచ్చారో తెలుసుకోడానికి ఉపకరించే ఆత్మకథ 'నియతి'.

నల్లగొండ జిల్లాకు చెందిన ముత్యాలు ఇప్పటివరకు రాసిన ఏడు పుస్తకాలు అచ్చయ్యాయి. కవిత్వపుస్తకం 'దుగిలి' 2003లో వచ్చింది. నాటి నుంచి వెనుదిరిగి చూడలేదు. ముఖ్యంగా కవిత్వానికి పరిమితం కాకుండా వచనం వైపు మొగ్గు చూపడం గమనార్హం. సూర, పురుడు, ఇగురం నవలలు రాశారు. తెలంగాణ జీవద్భాషలో జీవితాన్ని చిత్రించడంలో ముత్యాలు సఫలమయ్యారు.

తన జీవితంలోని విభిన్నదశల్ని చాలా ధైర్యంగా, నిజాయితీగా, తను మాట్లాడే భాషలో రాయడం ముత్యాలు సృజనలోని విశిష్టకోణం. ముత్యాలుకు తెలంగాణ భాష మీద వున్న మంచి పట్టును ఈ ఆత్మకథ తెలియజేస్తుంది. ఏ విషయాన్నీ దాచుకోలేదు. ఇలా రాస్తే తన గురించి ఎవరేమనుకుంటారోనని జంకలేదు. చదువుకునేరోజుల్లో, ఉద్యోగం చేసే కాలంలో ఎదురయిన వివక్ష, అనుమానాలు, ఆనంద సన్నివేశాలు, విషాదమైన మలుపులు ఎన్నో ముత్యాలు ఆత్మకథలో దర్శనమిస్తాయి.

ముత్యాలు చదువుకునే రోజుల్లో కూలిపనులు చేసాడు, రిక్షా తొక్కాడు. బావులు తీసాడు. రెక్కల కష్టమ్మీదనే బతుకు బండి లాగించుకు వచ్చాడు. పదోతరగతి పాసవటం గొప్ప మలుపు ముత్యాలు జీవితంలో. అసలు పాసయ్యాడో లేదో తెలియని స్థితిలో పడిన ఆందోళనని అతని అక్షరాల్లో చదివితే కళ్ళు చెమ్మగిల్లుతాయి. హాస్టళ్ళలో పడిన వెతలు, బాధలు రాసిన తీరు పాఠకుల్ని విచలితుల్ని చేస్తాయి.

ఈ పుస్తకంలో తెలంగాణ భాషలోని అందచందాల్ని, నుడికారాన్ని అభివ్యక్తం చేయడంలో ముత్యాలు చూపిన ప్రతిభ విస్మయానికి లోను చేస్తుంది. అతని బతుకు నడకలోని వైవిధ్యం చాలా ఆర్ద్రమైంది. ఒక రచయితగా ముత్యాలు రూపుదిద్దుకోవడం వెనుక ఉన్న నేపథ్యం ఏమిటో ఈ ఆటోబయోగ్రఫీ చెబుతుంది. అందుకే తెలంగాణలోని కవులు, రచయితలు ముత్యాలు రాసిన ఈ 'నియతి'ని చదవాలి. ఆపైన ముత్యాలు సాహిత్యాన్ని చదివి అర్థం చేసుకోవాలి. నల్లగొండకు చెందిన 'గుంపు' సాహితీసంస్థ ఈ పుస్తకాన్ని ప్రచురించింది. వేముల ఎల్లయ్య ఇచ్చిన తోడ్పాటును ఎంతో అభిమానంతో గుర్తు చేసుకున్నారు ముత్యాలు. కవిత్వం, సాహిత్యం పండితుల సొత్తుకాదు, శ్రమించి సాధించుకోవడం దళితులకు కూడా సాధ్యమేనని ముత్యాలు జీవితం చెబుతుంది.

- కిరణ్‌కుమార్

సినిమాటిక్ నవల



గురి , రచన : సింహప్రసాద్,
పేజీలు : 219, వెల : 150/-,
ప్రతులకు : శ్రీశ్రీ ప్రచురణలు,
హైదరాబాద్ అన్ని ప్రధాన పుస్తక కేంద్రాలు.

వందల్లో కోడిపందాలు, లక్షల్లో గుర్రప్పందాలు లీగల్. ఇదీ మనం నిర్మించుకున్న రాజకీయ వ్యవస్థ తీరూతెన్నూ. లొసుగుల్లేని చట్టాలుండవు. రాజమార్గం ఉన్నప్పుడు దొడ్డి దోవా ఉంటుంది. ఇదీ మన చట్టాల పని తీరు. ఇందువల్లే సామాన్య భారతీయ పౌరుడికి ముఖ్యంగా అట్టడుగు వర్గాల వారికి దేశ పరిపాలన మీద నమ్మకం సన్నగిల్లుతోంది. ఈ విషయాన్ని నిశితంగా గమనించిన ప్రముఖ రచయిత శ్రీ సింహప్రసాద్‌గారు. తన 'గురి' నవలకు ఇతి వృత్తంగా ఎన్నుకున్నారు. 'గురి' (లక్ష్యం వైపు శ్రద్ధ) ఉండాలి గాని ఏదైనా సాధించొచ్చు. పట్టుదల కేవలం నాలుగక్షరాల పదం కాదు. దాని వెనుక సముద్రమంత విశాలముంది. అగాధమంత లోతు ఉంది. ఆకాశమంత ఎత్తు ఉంది. దాన్ని సడలనివ్వకుంటే ఎలాంటి గురినైనా ఛేదించి తీరతాం (పేజీ 25) అని నిరూపించబడిందీ నవలలో.

నవల అంతా ఓ సామాన్య, అతిపేద, బెస్తపల్లెలోని యువకుడు 'పండు' అని పిలవబడే వ్యక్తి చుట్టూ తిరుగుతుంది. పండు (అర్జున్) తండ్రి ఆ బెస్తపల్లెలో నాయకుడు. సెజ్‌ల పేరిట వారి పల్లె ఆక్రమించుకోబడి, బెస్తవారందరూ నిరాశ్రయులౌతారు. ఉపాధికోల్పోతారు. ప్రభుత్వం ద్వారా ఆ పల్లెని ఆక్రమించిన రాజూనాయక్ అక్కడో లాస్‌వెగాస్ (గాంబ్లింగ్ నగరం) నెలకొల్పాలని పావులు కదుపుతుంటాడు. రాజూనాయక్ ఓ మాఫియా లీడర్. అసాంఘింక కార్యకలాపాల ద్వారా కోట్ల కొలది డబ్బును కూడబెడతాడు. విద్యాధికుడు, నిరుద్యోగి, చేతిలో చిల్లిగవ్వ కూడా లేని పండు నిర్వాసితులైన ఆ పల్లెవారి తరపున నిలబడి రాజూభాయ్ నెదిరించి ఆయన్ను తుదముట్టించడంతో నవల ముగుస్తుంది.

సింహప్రసాద్‌గారు తన రచనా పటిమతో ఒక గొప్ప యాక్షన్, క్రైం, థ్రిల్లర్, ఇద్దరు నాయికలు, ప్రేమ, వారి అందాలు... వెరసి మనకో సినిమా చూపిస్తారు. మొదలు పెట్టినప్పటినుండీ చివరి దాకా ఉత్కంఠతో చదివించగలిగే పుస్తకానికుండే అన్ని హంగులు ఉన్న మంచి కాలక్షేపం నవల. సహజత్వం పక్కన పెడితే ఒక సినిమాకు సరిపోయేంత గ్లామరు, గ్రామరు, క్లామరు ఉన్న నవల.

– కూర చిదంబరం, 8885552423

ఉద్యమస్ఫూర్తికి ప్రతిఫలనం

మశాల్- తెలంగాణ మహోద్యమ కావ్యం
రచన: వనపట్ల సుబ్బయ్య,
పేజీలు: 192, వెల: రూ. 100
ప్రతులకు: ప్రముఖ పుస్తక కేంద్రాలు,
ఎం.సుబ్బయ్య, ఫోను:94927 65358

రాష్ట్ర సాధన తర్వాత కూడా ఆ ఆశయం కోసం జరిగిన ఉద్యమం కవులకు స్ఫూర్తిగా, ప్రేరణగా నిలిచింది. కనుకనే ఆ ఉద్యమాన్ని, ఉద్యమకాలపు తీవ్రతను ప్రతిఫలిస్తూ వనపట్ల సుబ్బయ్య దీర్ఘకవిత రాశారు. 'మశాల్- తెలంగాణ మహోద్యమ కావ్యం' శీర్షికన ఈ పుస్తకాన్ని 'ముక్త ప్రచురణలు' అచ్చువేసింది. ఉద్యమానికి సంబంధించిన బహుళ పార్శ్వాల్ని చిత్రిక పట్టారీ కవితలో. మరీ ముఖ్యంగా 2009-2014 నడుమ కాలంలో ఉద్యమానికి ఊతమిచ్చిన శక్తులు, ఉద్యమాన్ని నీరుగార్చే కుట్రలు, రాష్ట్ర సాధనని అడ్డుకోడానికి ప్రయత్నించిన వ్యక్తులు, వారి వైనాలు ఈ దీర్ఘకవితలో చూడొచ్చు. ఒకవిధంగా ఇది ఈ ఉద్యమకాలపు చరిత్రకు కవిత్వరూపం. ఉద్యమచరిత్రను పుస్తకాలుగా రాసేవారు తప్పనిసరిగా చదవాల్సిన దీర్ఘకవిత ఇది. కె.విమల, సంగిశెట్టి శ్రీనివాస్, యం.కోదండరామ్ ముందుమాటలు ఈ కావ్యం ప్రత్యేకతలను వివరించారు. ఉద్యమాన్ని కవిత్వం చేయడంలో కవి సాఫల్యాన్ని విశ్లేషించారు. తెలంగాణ ఉద్యమక్రమాన వచ్చిన దీర్ఘకవితల్లో ఇది ప్రత్యేకమైంది.

కనిపించని బీభత్సానికి కథారూపం

హింసపాదు (కథల సంపుటి)
రచన: బమ్మిడి జగదీశ్వరరావు, పేజీలు: 290,
వెల: రూ. 180, ప్రతులకు: సిక్కోలు బుక్‌ట్రస్ట్,
ఎంఐజి-100, హౌసింగ్‌బోర్డు కాలనీ, జిల్లా పరిషత్ ఎదురుగా, శ్రీకాకుళం-532 001
ఫోను: 99892 65444

వాస్తవికతకు వ్యంగ్యాన్ని జోడించి కథని నడిపించే శైలి ఉత్తరాంధ్ర కథల్లో చూస్తాం. ఈ ధోరణి రావిశాస్త్రి, కె.ఎన్.వై.పతంజలి కథల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. ఆ పరంపరకు చెందిన కథా రచయిత బమ్మిడి జగదీశ్వరరావు. కథ చెప్పడంలో వ్యంగ్యాన్ని పదునుగా వాడుకోవటం తెలిసిన రచయిత. ఇదివరలో రెక్కలగూడు, పిండొడిం కథల సంపుటి ద్వారా పాఠకులకు సుపరిచితులు. ఇప్పుడు 'హింసపాదు' పేరుతో జగదీశ్వరరావు కథల పుస్తకాన్ని సిక్కోలు బుక్‌ట్రస్ట్ ప్రచురించింది. దీనిలో ఇరవై అరు కథలున్నాయి. గత ఇరవై ఏళ్ళ సామాజిక జీవితానికి సంబంధించిన ప్రతిఫలనాలు దీనిలో కనిపిస్తాయి. సామాజిక, రాజకీయ పరిణామాల ప్రభావాల మీద ప్రతీకాత్మకశైలిలో రాసిన కథలివి.

జీవితాల్ని కబళించే మృత్యువికటాట్టహాసం తీరుతెన్నుల్ని చాలా కథల్లో రూపుకట్టించారు. 'నెత్తుటిగడ్డ, ఎన్‌కౌంటర్, హింసపాదు, దెయ్యం ఆత్మహత్య, కిల్లింగ్ డాట్‌కామ్, చీకటి వేకువ, వెంటాడే నీడ' వంటి కథల్లో గత ముప్పయ్యేళ్ళ జీవితం తాలూకు బీభత్సం ఆవిష్కృతమైంది. రచయిత ఉత్తరాంధ్ర యాసని పదునుగా వాడుకున్నారు. సంకేతప్రాయంగా చాలా విషయాల్ని ప్రస్తావిస్తారు. జీవితాల్లో అలుముకున్న చీకటికీ, జీవితంపై పెంచుకున్న ఆశలకీ, వాస్తవాలకీ పొంతన కుదరని స్థితికీ మూలాలు ఎక్కడున్నాయో చెప్పే ప్రయత్నం చాలా కథల్లో కనిపిస్తుంది. అందుకోసమే ఈ కథలు చదవాలి.

– శశాంక

■ ఈ వారం కవిత్వం

మంచివి కానివన్నీ మంచివే!

ఎండైనా మంచిదే
నీడైనా మంచిదే
చినుకు మెరిసిన తడీ మంచిదే
మంచునవ్వే రేయంతా మంచిదే

వెలుగులో లోకం పని చేసుకుంటుంది
చీకటిలో దేహానికి
విశ్రాంతి దొరుకుతుంది
మనసులో తీపి లేకపోతే
నాలుక ఎండిపోతుంది
ఆనందంగా వున్నప్పుడే
రుతువు అందంగా వుంటుంది

పచ్చ పచ్చని అడవులు కావాలి
శాంతంగా పారే నదులూ కావాలి
ఎడారుల్లో ఒయాసిస్సులూ వుండాలి
ఆకాశం నిండా దీపాలు వెలగాలి

ఏ ఉదయం పూటైనా తూర్పు మంచిదే
పక్షులు తిరిగొచ్చే పడమరా మంచిదే
ఆ కొసనూ ఈ కొసనూ కలిపే
ఇంద్రధనస్సూ మంచిదే

పాలు తాగే పిల్లి మంచిదే
బొమ్మను కొరికే కుక్కపిల్లా మంచిదే
ముద్దుగా పెంచిన పావురం మంచిదే
చెట్టుమీది చిలుక మంచిదే
అన్నిటినీ బెదిరించే
పిల్లాడి ఆటా మంచిదే

అన్నం వేళవచ్చే కాకి మంచిదే
అరచి అరచి అమ్మే అల్లంరబ్బా మంచిదే
బండి మీదినుండి పడిపోయిన
అరటిపండూ మంచిదే
ముసలమ్మ అమ్మేటి కరివేపాకు మంచిదే
వారం వారం వచ్చే ఆదివారం మంచిదే

అన్నీ మంచివే
మంచివి కానివన్నీ కూడా
చాలా మంచివే
ఈ మనిషే మంచోడు కాడు
మనసులేనోడు మనిషే కాడు

- ఆశారాజు, 9392302245

సోవియట్ కవితలు
కవి : రసూల్ గమ్జతోవ్, కైసిన్‌కులీవ్, అన్నా అక్మతోవ

కాలం గాలం

ఉదయం సాయంత్రం రేయింబవళ్ళు
తెల్లని జాలరులు, నల్లని జాలరులు
ఈ ప్రపంచం ఒక మహా సముద్రం
మనం ఈదులాడువాళ్ళం
అగాధంలో ఉరుకులాడే చేపలం
ఒడ్డునిండా జాలరులు
జాలాలను కొక్కాలను ఎర్రలను
సిద్ధపరిచి వేచివున్న జాలరులు
ఓ కాలమా
ఎప్పుడు నన్ను పట్టేది
ఏ దిన గాలంలో ఏ రాత్రి జాలంలో

మాతృహృదయం

ఎచటో దూరాన ఓ తల్లి పాడుతుంది
అది జోలకాదు, వేదనా రుధిరప్రవంతి –
ప్రపంచంలో బాధలన్నీ అందులో అల్లుకున్నై-
యుద్ధంలో పేలిన ప్రతి గుండూ
ఒక గాయం చేస్తుంది – అదే మాతృహృదయం
ఎవరు గెల్చినా ఎవరు ఓడినా
మాతృహృదయం బద్దలవుతుంది

కళాశిల్పం

వేలాది వేల సంవత్సరాలుగా
మా పవిత్ర కళాశిల్పం జీవిస్తూ వుంది, ఆ
కళాశిల్పంతో చీకటిలో ప్రకాశవంతమై
ఈ భూమి గూడా కారే కవీ సుఖదు:ఖాల మధ్య
రణం రుణం మరణం
లేదని మాత్రం పలకలేదు

- కోటం చంద్రశేఖర్, 9492043348



టైటానిక్‌లా కనిపిస్తున్న ఈ ఓడ దాదాపు అంత చరిత్ర కలదే. ఇది 17వ శతాబ్దానికి చెందిన స్వీడిష్ యుద్ధ నౌక. పేరు వాసా. 400 మంది కళాకారులు తన సృజనాత్మకతనంతా ఉపయోగించి దీన్ని తయారు చేశారు. ఇందులో 64 ఫిరంగులు ఏర్పాటు చేశారు. ప్రమాదవశాత్తు అది నీళ్లలో మునిగిపోయి ముప్పై మంది చనిపోయారు. తర్వాత దాన్ని పూర్తిగా మర్చిపోయారు. మళ్ళీ 1961 లో దాన్ని గుర్తించి, 1988లో స్టాక్హోమ్ వాసా మ్యూజియంలో భద్రపరిచారు. ఇప్పుడు ఇది స్వీడన్‌కు వచ్చే కోట్లాది మంది పర్యాటకులకు ప్రత్యేక ఆకర్షణ.





పతంగుల పండగ

సంక్రాంతి పండగ వస్తుందంటేనే పిల్లలకి, పెద్దలకి ముందుగా గుర్తొచ్చేవి పతంగులే. ఒకరికంటే మరొకరి గాలిపటాలు ఎక్కువ ఎత్తుకు ఎగరాలని పోటీ పడి మరీ ఎగరేస్తుంటారు. గాలిపటం ఎంత ఎక్కువ ఎత్తుకు పోతే అంత సంబరం. ఇవి ఎగరేస్తుంటే విసుగు రాదు, విరామం వద్దు. అన్నీ మర్చిపోయి ఆనందంగా గడిపే అపురూపమైన మధుర క్షణాలవి.